నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 2-10-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 57 పేజీలు:4 వెల: రూ.1/-

ప్రతి రోజు లక్ష టన్నుల చెత్తను శుద్ధీకరిస్తున్నాం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0, అమృత్ 2.0 కార్యక్రమాలను ప్రధాని మోదీ ఇవాళ ప్రారంభించారు. నగరాలను చెత్త రహితంగా చేయడమే స్వచ్ఛభారత్ మిషన్ 2.0 లక్ష్యమని ఆయన తెలిపారు. రెండవ దశతో సీవేజ్ మేనేజ్మెంట్‌పై కూడా దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పారు. నగరాలన్నింటిలో నీటి సంరక్షణ చర్యలు కూడా చేపడుతామన్నారు. బురద నీరు చెరువుల్లో చేరకుండా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను అందుకోవడంలో స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కీలకంగా నిలుస్తుందని ప్రధాని తెలిపారు. పట్టణాభివృద్ధి వల్లే సమానత్వం సాధ్యమవుతుందన్నారు.

స్వచ్ఛభారత్ రెండవ దశలో భాగంగా నగరాల్లో ఉన్న చెత్త గుట్టలను ప్రాసెస్ చేసి తొలగించనున్నట్లు ప్రధాని తెలిపారు. ఢిల్లీలో ఉన్న ఓ గార్బేజ్ ప్రదేశాన్ని శుభ్రం చేయనున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి రోజు దేశంలో లక్ష టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేస్తున్నట్లు ప్రధాని చెప్పారు. 2014లో స్వచ్ఛ భారత్ మొదలు పెట్టిన సమయంలో కేవలం 20 శాతం మాత్రమే చెత్తను శుద్ధి చేసేవారని, ఇప్పుడు 70 శాతం చెత్తను ప్రతి రోజు ప్రాసెస్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాన్ని వంద శాతానికి తీసుకురావాలని ప్రధాని చెప్పారు.

గెల్లు శ్రీనివాస్ నామినేషన్

హుజురాబాద్ ,అక్టోబర్ 1: హుజురాబాద్ ఉపఎన్నిక కోసం నామినేషన్ల పర్వం మొదలైంది. మాజీ మంత్రి ఈటల రాజేందర్ రాజీనామాతో హుజూరాబాద్? నియోజకవర్గానికి ఉపఎన్నిక జరుగుతోంది. టీఆర్ఎస్, బీజేపీ నేతల ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. హుజూరాబాద్ ఉపఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న గెల్లు శ్రీనివాస్ యాదవ్ నామినేషన్ వేశారు. ఆర్డీవో కార్యాలయంలో నామపత్రాలు దాఖలు చేశారు. అక్టోబర్ 8 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంది. 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో ఉన్న గెల్లు శ్రీనివాస్‌పై 100కు పైగా కేసులు ఉన్నాయి. ఉద్యమ సమయంలో పలుమార్లు పోలీసులు అరెస్టు అయ్యి జైలు జీవితం గడిపారు. 2017 నుంచి టీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

కాంపా నిధులు కేంద్రానివి కావు : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 1: కాంపా నిధులు కేంద్ర ప్రభుత్వానివి కావు. 100 శాతం అది రాష్ట్రాల డబ్బులు మాత్రమే అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

శాసనసభలో హరితహారంపై స్వల్పకాలిక చర్చ చేపట్టిన సందర్భంగా సభ్యులు మాట్లాడిన అనంతరం సీఎం కేసీఆర్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు.

నీటి ప్రాజెక్టులు, రోడ్లకు, లేదా ఇతర అవసరాల కోసం అటవీ భూములను కొనుగోలు చేస్తాం. అడ్వాన్స్ కింద రాష్ట్రాలు కేంద్రానికి డబ్బులు చెల్లించాలి. ఈ క్రమంలో తెలంగాణ నుంచి కేంద్రం వద్ద జమ చేసిన డబ్బు రూ. 4675 కోట్లు. ఇవి మనం కట్టిన డబ్బులే. కేంద్రానిది నయా పైసా కూడా లేదు.

అయితే మోదీని కలిసి కాంపా నిధులు విడుదల చేయాలని కోరాం. మొత్తానికి 4 సంవత్సరాల తర్వాత విడుదల చేశారు.

అయితే మనకు ఇచ్చే నిధుల్లో 10 శాతం కేంద్రం కట్ చేస్తుంది. మొత్తం ఇవ్వాలని అడిగాం. పరిశీలన చేస్తామని కేంద్రం చెప్పింది.

కాంపా నిధుల్లో భాగంగా రాష్ట్రానికి రూ. 3,109 కోట్లు నిధులు విడుదల చేశారు.

ఇందులో రూ. 1320 కోట్లు ఖర్చు పెట్టాం. నరేగా కింద రూ. 3673 కోట్లు ఖర్చు చేశాం. హెచ్ఎండీఏ ద్వారా రూ. 367 కోట్లు, జీహెచ్ఎంసీ ద్వారా రూ. 83 కోట్లు ఖర్చు చేశాం

. నర్సీరల పెంపకం, ఏర్పాటు, కూలీలు, మొక్కల సరఫరా, నీటి రవాణాకు ఖర్చు చేశాం. నిధుల దుర్వినియోగం జరగడం లేదు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం కోసం రూ. 6,555 కోట్లు ఖర్చు చేశామని కేసీఆర్ వెల్లడించారు.

82,491 కి.మీ. మేర ప్లాంటేషన్

మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ కింద 67,276 కి.మీ. ఆర్ అండ్ బీ కింద 28,080 కి.మీ. నేషనల్ హైవేస్ కింద 4 వేల కి.మీ. ఉన్నాయి. అన్నీ కలిపితే 1,00,156 కి.మీ. మేర రోడ్ లెంత్ ఉంది. ఇందులో 82491 కి.మీ. మేర ప్లాం టేషన్ చేశారు. పంచాయతీరాజ్ కింద 59 వేల కిలోమీటర్లు కవర్ చేశారు. ఆర్ అండ్ బీ వారు 8652 కి.మీ. మేర మొక్కలు నాటారు. ఫారెస్టు డిపార్ట్‌మెంట్ అది కారులు.. జాతీయ రహదారులపై మొక్కలు నాటి, వారి పరిరక్షణకు చర్యలు తీసుకుం టున్నారు అని సీఎం కేసీఆర్ తెలిపారు.

తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడి మృతి

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 1:(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. తంగళ్లపల్లిలో తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు బండి శేఖర్ (53) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు..శుక్రవారం సాయంత్రం యధావిధిగా కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. కాగా, హఠాత్తుగా ఉరుములు, మెరుపులతో పిడుగులు పడ్డాయి.దీంతో భయాందోళనకు గురైన శేఖర్ తాటి చెట్టు పై నుంచి జారి కింద పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శేఖర్‌ను హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులపై సీఎం జగన్ సమీక్ష

అమరావతి, , అక్టోబర్ 1:పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర నిధులు త్వరగా వచ్చేలా చూడాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏపీలోని సాగునీటి ప్రాజెక్టులపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పోలవరం ప్రాజెక్ట్ పనుల ప్రగతిని సీఎం జగన్‌కు వివరించారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన దిగువ కాపర్ డ్యాం పనులు, కెనాల్స్‌కు కనెక్టివిటీ అంశాలపై సమీక్షలో చర్చించారు. గ్యాప్ 3 కాంక్రీట్ డ్యామ్ పనులు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. వచ్చే ఖరీఫ్ నాటికి కాల్వల ద్వారా నీరందించేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. ఈసీఆర్ఎఫ్ పనుల ప్రారంభానికి ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి 2,033 కోట్ల రూపాయలకు పైగా నిధులు రావాల్సి ఉందని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర నిధులు త్వరగా వచ్చేలా చూడాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఖర్చు ఎప్పటికప్పుడు రీయింబర్స్ అయ్యేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుకుని తగిన చర్యలు తీసుకునేలా చూడాలని సీఎం సూచించారు.

నెల్లూరు బ్యారేజీ పనులు పూర్తి చేశామని.. నవంబర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధమని అధికారులు సీఎంకు వివరించారు. అవుకు టన్నెల్ నిర్మాణంలో గణనీయ ప్రగతి సాధించామని.. వచ్చే ఆగస్టు నాటికి టన్నెల్ పూర్తి చేసి నీటిని ఇస్తామని అధికారులు తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్ట్ పనులపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. రెండో టన్నెల్ పనులు వేగవంతం చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. వంశధార స్టేజ్-2 పనులు వచ్చే మే నాటికి పూర్తి చేస్తామని తెలిపారు అధికారులు. నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఒడిశా రాష్ట్రంతో చర్చల కోసం చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ సూచించారు. తోటపల్లి బ్యారేజీ కింద వచ్చే ఖరీఫ్ నాటికి నీటిని అందిస్తామని అధికారులు తెలిపారు.

నల్సార్ చట్ట సవరణ బిల్లు- (2021)ను ప్రవేశపెట్టిన మంత్రి ఐకే రెడ్డి

హైదరాబాద్ , అక్టోబర్ 1: శాసన సభలో నల్సార్ చట్ట సవరణ బిల్లును న్యాయ శాఖమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1998 సంవత్సరం, తదనంతరం అవసరానికి అనుగుణంగా నల్సార్ చట్టంలో కొన్ని మార్పులు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసుకున్న తర్వాత ఈ చట్టాన్ని అడాప్ట్ చేసుకున్నామన్నారు. ఈ చట్టంలోని సెక్షన్ 5ం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన స్థానిక విద్యార్థులకు 20 శాతం సీట్లకు కోటాను కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బిసిలు, దివ్యాంగులు, మహిళలకు రిజర్వేషన్లు వర్తింపజేస్తున్నామని విరించారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ప్రత్యేక హైకోర్టులను ఏర్పాటు చేసినందున, 1998 నల్సార్ చట్టంలో ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పేరును సాంకేతికంగా తెలంగాణ హైకోర్టుగా మార్చాల్సిన అవసరం ఉందని సభకు తెలియజేశారు.

సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రానికి చెందిన స్థానిక విద్యార్థులకు అధికంగా అదేవిధంగా వెనుకబడిన కులాల విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారని తెలిపారు. స్థానిక విద్యార్థులకు ప్రస్తుతం ఉన్న 20 శాతం కోటాను 25 శాతానికి పెంచడంతో పాటు, మొత్తం సీట్లలో సీట్లలో బీసీ/ ఓబీసీలకు రిజర్వేషన్ విధాన కోటా ప్రకారం వీరికి సీట్లు కేటాయించే విధంగా ఈ చట్టంలోని నిబంధనలు సవరించాలని కోరారు.

ఈ చట్ట సవరణ వల్ల రాష్ట్రానికి చెందిన స్థానిక విద్యార్థులు, బీసీ/ ఓబీసీ విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. చట్ట సవరణ బిల్లును ఆమోదించాల్సిందిగా సభను కోరారు. మంత్రి ప్రవేశ పెట్టిన ఈ బిల్లును శాసన సభ ఆమోదించింది.

పోడు భూముల సమస్యకు త్వరలోనే పరిష్కారం : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 1:రాష్ట్రంలోని పోడు భూముల సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. హరితహారంపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ చేపట్టిన సందర్భంగా పోడు భూముల సమస్యలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై సీఎం కేసీఆర్ వివరణ ఇచ్చారు.

అత్యుత్సాహం ఉండే అధికారులు.. అడవి మీద ఆధారపడి బతికే గిరిజనులను డిస్టర్బ్ చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఘర్షణలు కూడా జరిగాయి. పోడు భూముల సమస్యలపై గతంలో చర్చలు కూడా జరిగాయి. గతంలో యూపీఏ గవర్నమెంట్ ఒక చట్టం కూడా తెచ్చింది. పోడు భూములు దున్నుకునే వారికి రక్షణ కల్పిద్దామని ఆ చట్టంలో పొందుపరిచారు. ఎట్టి పరిస్థితుల్లో ఫారెస్ట్ కింద నోటిఫై అయిన ల్యాండ్ ఓనర్‌షిప్‌కు మారదు. అది సెంట్రల్ యాక్ట్. అది మన చేతుల్లో కూడా లేదు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ల మేరకు రూపొందించిన యాక్టులో అని సీఎం స్పష్టం చేశారు.రాష్ట్రంలో 96,676 మంది గిరిజనులకు 3.8 లక్షల ఎకరాలకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వడం జరిగింది. రైతుబంధు ప్రారంభించినప్పుడు వీరికి రైతు బంధు వచ్చేది కాదు. ఆ తర్వాత వారికి కూడా రైతుబంధు ఇస్తున్నాం. ఈ పోడు భూముల వ్యవహారాన్ని తేల్చుతామని ప్రజలకు హామీ ఇచ్చాం. తేల్చాల్సిన అవసరం ఉంది. అటవీ అధికారులు, గిరిజనుల మధ్య గొడవలు ఉండటం మంచిది కాదు. అది సమసిపోవాలి.

ఈ సమస్యపై మంత్రి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ చేశాం. వారు పలు దఫాలుగా చర్చించారు. ఇప్పటికే పట్టాలిచ్చిన భూములు కాకుండా, ఎంత భూమి పోడు వ్యవసాయం చేస్తున్నారో తేల్చితే, వారికి కూడా ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చి, రైతుబంధు ఇస్తే ఆ సమస్య సమసి పోతోంది. ఘర్షణ కూడా తగ్గిపోతుంది. అది కావాలంటే ఆ యాక్ట్ తేదీని పొడిగించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయాల్సిన అవసరం ఉంటుంది. సబ్ కమిటీ రిపోర్టు ఆధారంగా ఈ శాసనసభ సమావేశాల్లోనే ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిద్దాం. ఆర్వోఎఫ్ఆర్ పట్టా ఇచ్చినంత మాత్రం వారు ఓనర్లు కారు. జీవన భృతి కోసమే ఈ పట్టా ఉపయోగపడుతుంది. అవసరమైతే పోడు భూముల విషయంలో అఖిలపక్ష బృందాన్ని బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని సీఎం అన్నారు.

పల్లె ప్రకృతి వనాలతో బీపీలు, షుగర్లు మాయం..! : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 1: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు.. బీపీ, షుగర్లతో పాటు ఇతర జబ్బులతో బాధపడే వారికి ఎంతో ఉపయోగకరంగా మారాయన్నారు. ప్రశాంతతో పాటు మంచి ఆహ్లాదాన్ని పంచుతున్నాయని సీఎం తెలిపారు. శాసనసభలో హరితహారంపై స్వల్పకాలిక చర్చ చేపట్టిన సందర్భంగా సభ్యులు మాట్లాడిన అనంతరం సీఎం కేసీఆర్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు.గ్రామపంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. నర్సరీల ఏర్పాటులో అటవీ అధికారుల కృషి విశేషంగా ఉంది. పల్లె ప్రకృతి వనాలతో చెట్ల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేశాం. 19,472 ఆవాసాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయబడ్డాయి. 13,657 ఎకరాల్లో ఈ వనాలు పెరుగుతున్నాయి. సర్పంచ్‌లను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. పల్లె ప్రకృతి వనాలను సర్పంచ్‌ల, మిగతా అధికారులు అద్భుతంగా తీర్చిదిద్దారు. గ్రామాల్లో బీపీ, షుగర్‌తో బాధపడేవాళ్లకు ఈ పార్కులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

మండలాల్లో బృహత్ వనాలు

మండలానికి ఒకటి చొప్పున బృహత్ ప్రకృతి వనాలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. 526 మండల్లాలో స్థలాలు గుర్తించి 7178 ఎకరాల్లో ప్లాంటేషన్ పనులు విస్తృతంగా జరుగుతున్నాయి. పట్టణాల్లో 109 ఏరియాల్లో 75740 ఎకరాల్లో అర్బన్ ఫారెస్టులు ఏర్పాటు చేస్తున్నారు. 53 అర్బన్ పార్కుల్లో పని బాగా జరిగింది. మిగతా ప్రాంతాల్లో కూడా పనులు కొనసాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలో చెట్లు నరికివేస్తే రూ. 4 లక్షల జరిమానా విధించాం. కఠినంగా వెళ్తున్నాం అని కేసీఆర్ స్పష్టం చేశారు.

66 లక్షల 25 వేల ఎకరాల అటవీ భూమి

తెలంగాణలో 2 కోట్ల 75 లక్షల ఎకరాల భూభాగం ఉంది. 66 లక్షల 25 వేల ఎకరాల పైచిలుకు అటవీ భూములు ఉన్నాయి. మొత్తం అడవులు మాయమై పోయాయి. ఉమ్మడి నిజామాబాద్‌లో అద్భుతమైన అడవులు ఉండే. కానీ మాయమైపోయాయి. నర్సాపూర్‌లో ఒకప్పుడు ఫిలిం షూటింగ్‌లు జరిగేవి. కానీ మన కళ్ల ముందే అడవులు ధ్వంసం అయ్యాయి.

అడవిని పునరుద్ధరించేందుకు మేధావులు పలు సూచనలు చేశారు. శాస్త్రీయ పద్ధతిలో వేర్ల ద్వారా అడవిని పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. 230 కోట్ల మొక్కలు నాటాలని హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించాం. 1987లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సిద్దిపేటలో 10 వేల మొక్కలు నాటాలని నిర్ణయం తీసుకున్నాం. ఆ మొక్కలను సేకరించేందుకు చాలా కష్టపడ్డాం. అనేక ఇబ్బందులు పడి 10 వేల మొక్కలు సేకరించి నాటామని తెలిపారు. అప్పట్లో నర్సరీలు ఉండేవి కావు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 20 కోట్ల మొక్కలు అడవుల్లో పెట్టాలని నిర్ణయించాం. వేర్ల ద్వారా 80 కోట్ల మొక్కలను పునరుద్ధరించాలని, 100 కోట్ల మొక్కలు బయట నాటాలని ప్రయాణం మొదలు పెట్టాం. 20 కోట్ల మొక్కలు టార్గెట్‌గా పెట్టుకుంటే.. ఇప్పటికే 20.64 కోట్ల మొక్కలు నాటాం. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో 10 కోట్ల మొక్కలు టార్గెట్ పెట్టుకుంటే 14.5 కోట్ల మొక్కలు నాటాం. అటవీ ప్రాంతాల బయట 130 కోట్లు టార్గెట్‌గా పెట్టుకుంటే, 176.82 కోట్లు నాటడం జరిగింది. ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

రజనీకాంత్ కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా.. కేటీఆర్ ప్రకటన

హైదరాబాద్ , అక్టోబర్ 1: కొద్ది రోజుల క్రితం మణికొండలోని ఓ డ్రైనేజీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రజనీకాంత్ కొట్టుకపోయి ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఇవాళ శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రజనీకాంత్ మృతి పట్ల మంత్రి కేటీఆర్ సంతాపం తెలుపుతూ.. ఆయన కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.రజనీకాంత్ మృతి చెందిన ఘటనకు సంబంధించి ఇప్పటికే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశించామన్నారు. తమ డిపార్ట్‌మెంట్ నిర్లక్ష్యం వల్లే ఆ ఘటన జరిగిందన్నారు. ఇందుకు మంత్రిగా తాను బాధ్యత వహిస్తున్నాను. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. కుంభవృష్టిని తట్టుకునేలా మున్ముందు చర్యలు తీసుకుంటామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

రాష్ట్రంలో మరిన్ని కేజీబీవీలు! : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్ , అక్టోబర్ 1:తెలంగాణలో 475 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, 194 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమాధానం ఇచ్చారు.

కేజీబీవీలను మరిన్ని ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది అని మంత్రి తెలిపారు. కేజీబీల స్థాయిని పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఆదర్శ పాఠశాలలు ఇంటర్మీడియట్ వరకు పని చేస్తున్నాయి. కేజీబీవీల్లో మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు అంచనా వేసి కల్పిస్తున్నాం. ఆదర్శ పాఠశాలల్లో సరిపడా మౌలిక సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. లక్షా పది వేల మంది బాలికలు కేజీబీవీల్లో చదువుతున్నారు అని మంత్రి సబితా వెల్లడించారు.

బ్యూరోక్రాట్లు, పోలీస్ అధికారుల తీరుపై సీజేఐ ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: బ్యూరోక్రాట్లు, ప్రధానంగా పోలీస్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరుపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఎన్వీ రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని బ్యూరోక్రాట్లు, ముఖ్యంగా పోలీస్ అధికారుల ప్రవర్తనపై తనకు చాలా అభ్యంతరాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ అధికారుల దారుణాలు, వారికి వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించేందుకు హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలన్న భావన తనకు కలిగిందన్నారు. అయితే ప్రస్తుతం దీనిని అమలు చేయడం లేదని, ఆ ఆలోచనను రిజర్వ్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

దేశద్రోహం, దోపిడీ, అక్రమాస్తులు కలిగి ఉండటం వంటి నేరారోపణలతో సస్పెండ్ అయిన ఛత్తీస్‌గఢ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గుర్జిందర్ పాల్ సింగ్, అరెస్ట్ నుంచి రక్షణ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. సీజేఐ ఎన్వీ రమణ, జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ హిమ కోహ్లీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై మరో విడత విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ ఎన్వీ రమణ ఈ వ్యాఖ్యలు చేశారు.

సెప్టెంబర్ 27న ఈ పిటిషన్ విచారణ సందర్భంగా కూడా సీజేఐ ఎన్వీ రమణ ఘాటుగా వ్యాఖ్యానించారు.

సస్పెండైన పోలీస్ అధికారిపై ఉన్న ప్రతి కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కోరడం సరికాదన్నారు. 'మీరు ప్రభుత్వంతో మంచిగా ఉన్నప్పుడు దోచుకుంటారు. అలాంటప్పుడు మీరు పడ్డీతో సహా తిరిగి చెల్లించాలి. అవినీతి పోలీస్ అధికారులకు ఎందుకు రక్షణ కల్పించాలి? వారికి రక్షణ ఎలాంటి రక్షణ కల్పించకూడదు. అలాంటి వారు జైల్లో ఉండాల్సిందే' అని వ్యాఖ్యానించారు.

ఆగస్ట్ 26న కూడా ఇదే పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ రమణ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఒక రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, పోలీసు అధికారులు దాని వైపు ఉంటారు. కొత్త పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆ అధికారులపై ప్రభుత్వం చర్యలు ప్రారంభిస్తుంది. ఇదొక కొత్త ధోరణి. దీనిని ఆపాల్సిన అవసరం ఉంది' అని అన్నారు.

మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసిన టీజీవో రిటైర్డ్ నేతలు

హైదరాబాద్ , అక్టోబర్ 1: తెలంగాణ ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు కలిశారు. శుక్రవారం నాడు శ్రీనివాస్‌గౌడ్‌తో భేటీ అయిన ఈ నేతలు.. రిటైర్డ్ టీజీవోలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ భేటీలో పాల్గొన్న టీజీవో సంఘం అధ్యక్షుడు మోహన్ నారాయణ, ప్రధాన కార్యదర్శి నర్సరాజు తదితరులు మంత్రికి తమ ఇబ్బందులు వివరించారు.తమ సమస్యలను పేర్కొంటూ వినతి పత్రాన్ని అందజేశారు. 35 సంవత్సరాల పాటు తాము ప్రభుత్వానికి సేవలు అందించామని, రిటైర్ అయిన తర్వాత పెన్షనర్ల సేవలను సరిగా అందకపోవడం బాధాకరమని వాపోయారు. దేశంలోని ధనిక రాష్ట్రాల్లో ఒకటి అయిన తెలంగాణలో పీఆర్‌సి-20 సంబం ధించి ఉద్యోగ పెన్షన ర్ల వేతన చెల్లింపు సక్రమంగా జరిగేలాచూస్తే తమకు చాలా మేలు కలుగుతుందని టీజీవో నేతలు మంత్రికి తెలిపారు.

రైతులకు మేలు చేసే ప్రభుత్వాన్ని మరిచిపోం

హుజురాబాద్, అక్టోబర్ 1:: మేము సామాన్యరైతులం, వ్యవసాయం చేసుకునే రైతు కూలీలం. మాకు టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు కావచ్చు, అన్ని రకాల ఫించన్లను రెండువందల నుంచి 2వేల పదహారు చేసింది. ఉచిత విద్యుత్, నీళ్లు కల్పించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసింది. కులాల వారిగా ఎన్నో పథకాలు కల్పిస్తున్నారు. ఎస్సీలకు దళితబంధు, గొల్లకుర్మల కు గొర్రెలు పంపిణీ ఇలా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు.ఇలాంటి గవర్నమెంట్‌ను మేము మరచిపోం. బీజేపీ ప్రభుత్వం మాకు చేసిందేం లేదు. బండి సంజయ్ మాకు ఎంపీగా ఉండి చేసిందేం లేదు. ఈటల రాజేందర్ కూడా ఏరోజు మమ్మల్ని పట్టించుకోలేదు. ఇప్పుడున్న విద్యుత్‌ను కూడా తీసేసి మీటర్లు పెట్టే ఆలోచనలో బీజేపీ ఉంది. అటువంటి బీజేపీకి ఓటేలా వేస్తం. ఎట్టిపరిస్థితుల్లో బీజేపీకి సహకరించం. మా గ్రామాల్లో మీరు తిరగాల్సిన అవసరం కూడా లేదు.ముఖ్యమంత్రి కేసీఆర్ అందరికీ న్యాయం చేస్తున్నాడు. ఈటల రాజేందర్‌గారు మొన్నటిదాక టీఆర్ఎస్‌లో ఉండి మా గవర్నమెంట్ మాకంటే మంచిగా పని చేసిన ప్రభుత్వం ఏది లేదని చెప్పి, మొన్నటికి మొన్న ఆయనేదో వ్యక్తిగత కారణాలతో బీజేపీలకు పోయి చేసేది చెప్తలేడు. చేసింది చెప్తలేడు.ప్రభుత్వం ఇన్ని కార్యక్రమాలు చేస్తుంటే కూడా బీజేపీవాళ్లు చేయలేదంటున్నరంటే బీజేపీకి ఎవరూ ఓటు వేయరు. ఎవరూ అందులోకి పోరు. మనకు టీఆర్ఎస్ గవర్నమెంట్ ఉన్నది. ఇంకా ముందు ముందు కూడా టీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తది. కాబట్టి అందరూ టీఆర్ఎస్‌కే ఓటు వేస్తరు. మేము కూడా చెప్తున్నం. అందరు కూడా మద్ధతు ఇస్తున్నారు.

ఆహ్వానం

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో

నాలుగు వారాలు

భవానీదేవి నాలుగు గ్రంథాల

ఆవిష్కరణ మహోత్సవం

తప్తశిల

ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ సి. భవానీదేవి జన్మదినోత్సవం సందర్భంగా

అక్టోబర్ మాసంలో నాలుగు ఆదివారాలు- నాలుగు గ్రంథావిష్కరణ సభలు జరుగనున్నాయి.

అందులో భాగంగా... మొదటి వారం- 3-10-2021 ఆదివారం సాయంత్రం 6గంటలకు...

డా. సి. భవానీదేవి తెలుగు కథల సంపుటి 'తప్త-శిల'కు హిందీ అనువాదం ఆవిష్కరణ

అనువాద రచయిత్రి: శ్ర

స్వచ్ఛ భారత్'తోనే ఆరోగ్య భారతం అన్నారు మహాత్మా

(02 అక్టోబర్ మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా)

పుణ్యభూమ భారత్‌కు పరాయి పాలన నుంచి స్వేచ్ఛ మాత్రమే కాదు పరిశుభ్రత, సమగ్రాభివృద్ధి చెందిన దేశం కూడా కావాలని మహాత్మాగాంధీ కలలు కన్నారు. స్వాతంత్ర్యం కన్న పారిశుద్ధ్యమే మిన్న అని గాంధీ ఉద్బోధించారు. పరిశుభ్రతే సరైన దైవభక్తి అని గట్టిగా నమ్మారు. పరిశుభ్రతే ఆరోగ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యమని మనకు తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించిందని, మన దేశ పరిశుభ్రత, పచ్చదనం కూడా సిధించాలని దేశ ప్రజలను కోరారు. 2014 వివరాల ప్రకారం మన దేశంలో 60 శాతం ప్రజలు (530 మిలియన్లు) బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తున్నారని అంచనా వేశారు. బహిరంగ ప్రదేశంలో మలమూత్ర విసర్జన చేయరాదని, దీనితో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుందని విచారం వ్యక్తం చేశారు. మహాత్ముని కలలను సాకారం చేయడానికి, స్వచ్ఛత వైపు మరో అడుగు వేయడానికి కేంద్ర గ్రామీణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖలు 2014లో 'స్వచ్ఛ భారత్ అభియాన్ లేదా స్వచ్ఛ భారత్ మిషన్ (క్లీన్ ఇండియా మిషన్)' అనబడే ప్రతిష్టాత్మకమైన జాతీయ పథకాన్ని తీసుకువచ్చారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా 2014-2019 పంచవర్ష కాలంలో 62,009 కోట్ల నిధులతో 4041 పట్టణాల వీధులు, రోడ్ల శుభ్రతతో పాటు పలు మౌళిక వసతులను కల్పించ తలపెట్టారు. 02 అక్టోబర్ 2014న 145వ గాంధీ జయంతి రోజున ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన కార్యక్రమంలో చీపురు పట్టి రోడ్డును ఊడ్చి దేశ స్వచ్ఛతకు శంఖారావం పూరించారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, కాలుష్యాన్ని కట్టడి చేయడం జరిగింది. 02 అక్టోబర్ 2019 మహాత్మాగాంధీ 150వ జయంతి వరకు భారత్‌ను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత (ఓడియఫ్) దేశంగా మార్చాలనే లక్ష్యం పెట్టుకున్నారు.

స్వచ్ఛ భారత్ పథకం ద్వారా వ్యక్తిగత, వీధి, సామాజిక టాయిలెట్లు నిర్మించ తలపెట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జనతో ప్రజారోగ్యం ప్రభావితం కావడం ద్వారా రోగాలు, చివరకు పిల్లల మరణాలు కూడా కలుగవచ్చు. ల్యాట్రిన్‌ల నిర్మాణమే కాకుండా వాటి పర్యవేక్షణ కూడా తీసుకోవడం జరిగింది. 2014 నుంచి 2019 వరకు 5 ఏండ్లలో భారత్‌ను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత (ఓపెన్ డిఫెకేషన్-ఫ్రీ, ఓడియఫ్) దేశంగా మార్చాలని భావించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పట్ల దేశవాసులకు పూర్తి అవగాహన కల్పించడానికి పథక రచన చేశారు. ప్రతి ఒక్కరు ఏడాదికి 100 గంటలు స్వచ్ఛ భారత సిద్ధికి సమయం వెచ్చించాలని కోరారు. గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను నియంత్రించుటతో గ్రామీణం స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంటాయని అంచనా వేశారు. 2019 వరకు అన్ని గ్రామీణ కుటుంబాలకు సురక్షిత నీరు, టాయిలెట్స్ వసతులు, అన్ని పాఠశాలలు/అంగన్‌వాడీలకు టాయిలెట్స్ వసతులు కల్పించనున్నారు. పట్టణ స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో భాగంగా 1.04 లక్ష గృహాలు, 2.5 లక్షల కమ్యునిటీలకు టాయిలెట్లు, 2.6 లక్షల పబ్లిక్ టాయిలెట్లు, ఘన వ్యర్థాల నిర్వహణలు సిటీల్లో చేపట్టనున్నారు. బహిరంగ మలమూత్ర విలర్జనను నివారించడం, సాధారణ లాయిలెట్లను ఫ్లష్ టాయిలెట్లుగా మార్చడం, అమానవీయ స్కావెంజర్ వ్యవస్థను రద్దు చేయడం లాంటి లక్ష్యాలను చేరనున్నారు.

2014-19 మధ్య అమలు చేయబడిన స్వచ్ఛ భారత్ ఫలితంగా పిల్లల డయేరియా సమస్యలు తగ్గాయి. స్వచ్ఛ భారత్ అమలైన 4,372 పట్టణాల్లో 4,340 నగరాలు (99 శాతం) ఓడియఫ్‌గా ప్రకటించబడ్డాయి. ఈ పథకం ద్వారా 66.72 లక్షల పబ్లిక్/కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మించబడ్డాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే ద్వారా దేశంలో అత్యుత్తమ క్లీన్ సిటీలను ఎంపిక చేశారు. స్వచ్ఛ భారత్ అమలుతో 10 కోట్ల కుటుంబాలకు టాయిలెట్స్ నిర్మాణం, 6 లక్షల గ్రామాలు ఓడియఫ్‌గా మార్చారు. 02 అక్టోబర్ 2014న 38.7 శాతం గృహాలకు టాయిలెట్స్ ఉండగా, 02 అక్టోబర్ 2019 నాటికి 100 శాతం టాయిలెట్ వసతులు కల్పించారు. స్వచ్ఛ భారత్ అభియాన్ ఫేజ్-1 పథకాన్ని 2014 నుంచి 2019 వరకు నిర్వహించారు. 2020-21 నుంచి 2024-25 వరకు రెండవ ఫేజ్ తీసుకున్నారు. స్వచ్ఛ భారతమే సురక్ష భారతిని, ఆయురారోగ్య ప్రదాయిని అని ప్రస్తుతించాల్సిందే. సువిశాల భారతంలో నెలకొన్న జనాభా విస్ఫోటనం, నిరుద్యోగ పర్వం, నిరక్షరాస్యత నెలవులుగా మారడంతో స్వచ్ఛ భారతాన్ని సులభంగా సాధన కష్టమే అని తెలుస్తున్నది. పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుద్ధత లాంటివి ప్రజా అవగాహనతోనే పరిపూర్ణం అవుతాయని తెలుసుకుందాం. మన ఆరోగ్యం కోసం మనమే నడుం బిగిద్దాం, పరిశుభ్ర భారత స్వప్నాలను సాకారం చేసుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

మంత్రిని కలిసిన నిర్మాతలే పవన్ ను కలిశారు..

అమరావతి, , అక్టోబర్ 1:తెలుగు సినిమా నిర్మాతలు జనసేన అధినేత, సినీ హీరో పవన్ కళ్యాణ్‌ను ఈ ఉదయం కలిశారు. దిల్ రాజు, డీవివి దానయ్య, సునీల్ నారంగ్, బన్నీ వాసులు ఈరోజు పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లారు. సినీ పరిశ్రమలో ఉన్న సమస్యలపై నిర్మాతలు పవన్‌తో చర్చించారు. ఆన్‌లైన్ టికెట్ల వ్యవహారంపై గత కొన్ని రోజులుగా రగడ జరుగుతున్నది. సినిమా వ్యవహారం కాస్త రాజకీయ రంగు పులుముకున్న సంగతి తెలిసిందే. ఈ వివాదానికి తెర దించేందుకు సినీ నిర్మాతలు రంగంలోకి దిగారు. పవన్ కళ్యాణ్ ఫై విమర్శలు చేసిన మంత్రి పేర్ని నాని ని కలిసిన టాలీవుడ్ నిర్మాతలు..ఈరోజు ఉదయం మళ్లీ పవన్ కళ్యాణ్ ను కలవడం చర్చ గా మారింది. అసలు ఏంజరుగుతుందని సినీ ప్రముఖులు , అభిమానులు మాట్లాడుకుంటున్నారు.

వారం రోజుల క్రితం రిపబ్లిక్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ లో పవన్ కళ్యాణ్ వైసీపీ సర్కార్ ఫై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. పవన్ వ్యాఖ్యల ఫై వైసీపీ నేతలు సైతం అదే రేంజ్ లో మండిపడ్డారు. ఇప్పటికే పవన్ ఫై మాటల యుద్ధం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మంత్రి పేర్ని నాని ని టాలీవుడ్ నిర్మాతలైన దిల్ రాజు , మైత్రి నిర్మాతలు , డివివి దానయ్య , బన్నీ వాసు మొదలగు వారు కలిసి చిత్రసీమ సమస్యలు , పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల ఫై మంత్రి తో మాట్లాడడం జరిగింది. ఆ క్షణం కూడా మంత్రి నాని , పవన్ ఫై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆ రోజు మంత్రిని కలిసిన నిర్మాతలే ఈరోజు మళ్లీ పవన్ కళ్యాణ్ ను కలవడం వెనుక రహస్యం ఏంటి అనేది అర్థం కావడం లేదు. పవన్ ను దూరం చేసుకోవడం ఇష్టం లేకనే మళ్లీ ఆయన్ను కలిసారా..లేక మంత్రి తో ఏమాట్లాడారనేది చెప్పడానికే కలిసారా అనేది తెలియాల్సి ఉంది. ఏదై ఏమైనప్పటికి ఇండస్ట్రీ లో ఏంజరుగుతుందనేది అర్థం కానీ పరిస్థితి నెలకొని ఉంది.

వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ఏడాది వరకు యాంటీబాడీలు: ICMR..

హైదరాబాద్ , అక్టోబర్ 1:దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియా వేగంగా కొనసాగుతోంది. వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతంగా అమలు చేస్తుండటంతో పాజిటివ్ కేసులు తగ్గుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. వందశాతం వ్యాక్సిన్ తీసుకున్న వారిలో యాంటిబాడీలు ఏడాది వరకు ఉంటాయని, బూస్టర్ డోసుల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని ఐసీఎంఆర్ డైరెక్టర్ బలరాం భార్గవ తెలిపారు. దేశంలో అనేక వ్యాక్సిన్లు ప్రస్తుతం అత్యవసర వినియోగానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్యాడిలా ఫార్మా తయారు చేసిన జైకోవ్ డి మూడో డోసుల వ్యాక్సిన్ త్వరలోనే మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తుందని, అత్యవసర వినియోగం కిందనే ఈ వ్యాక్సిన్‌ను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, జైకోవ్ డి వ్యాక్సిన్ కు సిరంజితో అవసరం ఉండదని, మూడు డోసుల ధరను త్వరలోనే ప్రకటిస్తారని ఐసీఎంఆర్ డైరెక్టర్ బలరాం భార్గవ తెలిపారు.

టాటా గ్రూప్ చేతికి ఎయిరిండియా.. ఖండించిన కేంద్రం

హైదరాబాద్ , అక్టోబర్ 1:నష్టాల్లో కూరుకుపోయిన ఎయిరిండియాను టాటా గ్రూప్ చేతిలోకి వెళ్లిందని మీడియాలో వచ్చిన వార్తలను కేంద్రం ప్రభుత్వం ఖండించింది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఎయిర్? ఇండియాను దక్కించుకునేందుకు చాలా సంస్థలు బిడ్లు దాఖలు చేయగా.. టాటా సన్స్‌కు దక్కిందని ప్రముఖ వాణిజ్య పత్రిక బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. దీనిపై స్పందించిన కేంద్రం.. ఎయిరిండియా పెట్టుబడుల ఉపసంహరణలో ఆర్థిక బిడ్లను ప్రభుత్వం ఆమోదించిందన్న మీడియా వార్తల్లో నిజం లేదని స్పష్టం చేసింది. దీనిపై నిర్ణయం తీసుకున్నప్పుడు ప్రభుత్వమే మీడియాకు వెల్లడిస్తుందని తెలిపింది.

డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు పరిశీలించిన మంత్రి తలసాని

హైదరాబాద్ , అక్టోబర్ 1: నగరంలోని బన్సీలాల్‌పేటలో డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడి ఇళ్ల నిర్మాణ పనులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వయంగా పరిశీలించారు. పనులు ఎలా జరుగుతుందీ అధికారులు ఆయనకు వివరించారు.పనితీరుపై మంత్రి తలసాని సంతృప్తి వ్యక్తం చేశారు. దీపావళి పండుగ నాటికి ఈ ఇళ్లలో గృహప్రవేశాలు జరుగుతాయని చెప్పారు. కాగా, ఇప్పటికే రాష్ట్రంలో పలుచోట్ల డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు పూర్తయిన సంగతి తెలిసిందే. ఈ పథకంపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టిందని అధికార పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

గ్రామ పంచాయతీలు, పానీ సమితీలతో జల్ జీవన్ మిషన్ అంశంపై నేడు సమావేశం కానున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 అక్టోబర్ 2న ఉదయం 11 గంటల కు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా గ్రామ పంచాయతీ లు, పానీ సమితులు/ విలేజ్ వాటర్ ఎండ్ శానిటేశన్ కమిటీస్ (విడబ్ల్యుఎస్ సి) తో సమావేశం కానున్నారు.

ప్రధాన మంత్రి స్టేక్ హోల్డర్స్ లో చైతన్యాన్ని పెంచడం తోను, అలాగే జల్ జీవన్ మిషన్ లో భాగం అయిన పథకాల పట్ల జవాబుదారుతనాన్ని పారదర్శకం గాను ప్రోత్సహించడం జరుగుతుంది. 'జల్ జీవన్ మిషన్ యాప్' ను ప్రారంభించనున్నారు.

ప్రధాన మంత్రి 'రాష్ట్రీయ జల్ జీవన్ కోశ్' ను కూడా ప్రారంభిస్తారు. ఈ నిధి కి ఏ వ్యక్తి అయినా, ఏ సంస్థ అయినా, ఏ కంపెనీ అయినా లేదా ఏ దాత అయినా.. వారు భారతదేశాని కి చెందినవారు కానీ, విదేశాల లో ఉంటున్నా గానీ చందా ను ఇవ్వవచ్చును. ఆ సొమ్ము ను గ్రామీణ ప్రాంతాల లోని ప్రతి ఒక్క కుటుంబాని కి, పాఠశాల కు, ఆంగన్ వాడీ కేంద్రాల కు, ఆశ్రమశాల కు, ఇంకా ఇతర సార్వజనిక సంస్థల కు నల్లా నీటి కనెక్షన్ ను అందించడం కోసం వినియోగిస్తారు.

అదే రోజు న 'జల్ జీవన్ మిషన్' అంశం పై జాతీయ స్థాయి గ్రామ సభ లు కూడా జరుగుతాయి. గ్రామ సభ లు పల్లెల లో నీటి సరఫరా వ్యవస్థ ల తాలూకు ప్రణాళిక రూపకల్పన, వాటి నిర్వహణ లను గురించి చర్చించడం తో పాటు, దీర్ఘకాలిక జల సురక్షత దిశ లో కృషి చేయడం గురించి కూడా చర్చిస్తారు.

పల్లెల లో నీటి సరఫరా వ్యవస్థ ల రూపకల్పన, అమలు, నిర్వహణ, మరమ్మత్తు లలో పానీ సమితులు ఒక కీలకమైన పాత్ర ను పోషిస్తాయి. తద్వారా ప్రతి కుటుంబాని కి శుద్ధమైన నల్లా నీటిని క్రమం తప్పక దీర్ఘకాల ప్రాతిపదికన అందేటట్లు చూస్తాయి.

6 లక్షల కు పైగా గ్రామాల లో నుంచి సుమారు 3.5 లక్షల గ్రామాల లో ఇంతవరకు పానీ సమితుల ను/విడబ్ల్యుఎస్ సి లను ఏర్పాటు చేయడం జరిగింది. ఫీల్డ్ టెస్ట్ కిట్స్ ను ఉపయోగించడం ద్వారా నీటి నాణ్యత ను పరీక్షించడం కోసం 7.1 లక్షల మంది కి పైగా మహిళల కు శిక్షణ ను ఇవ్వడం జరిగింది.

జల్ జీవన్ మిశన్ గురించి:

ప్రతి ఒక్క కుటుంబాని కి శుద్ధమైన నల్లా నీటిని అందించడం కోసం జల్ జీవన్ మిశన్ ను ప్రధాన మంత్రి 2019 ఆగస్టు 15న ప్రకటించారు. ఆ మిశన్ ప్రారంభించేటప్పటి కి కేవలం 3.23 కోట్ల గ్రామీణ కుటుంబాలు నల్లా నీటి సరఫరా సదుపాయానికి నోచుకొన్నాయి. ఇది 17 శాతాని కి సమానం గా ఉంది.

గడచిన రెండు సంవత్సరాల కాలం లో కోవిడ్-19 మహమ్మారి స్థితి ఉత్పన్నం అయినప్పటికీ కూడా 5 కోట్ల కు పైగా కుటుంబాల కు నల్లా నీటి కనెక్షన్ లను సమకూర్చడం జరిగింది. ఇప్పటివరకు చూస్తే రమారమి 8.26 కోట్ల గ్రామీణ కుటుంబాలు వారి ఇళ్ళ లో నల్లాల ద్వారా నీటిని అందుకొంటున్నాయి. అంటే ఈ సదుపాయం పొందిన వారు 43 శాతాని కి చేరుకొన్నారన్న మాట. 78 జిల్లాల లో, 58 వేల గ్రామ పంచాయతీల లో 1.16 లక్షల పల్లెల లో నివాసం ఉంటున్న ప్రతి ఒక్క గ్రామీణ కుటుంబం నల్లా నీటి సరఫరా సదుపాయాన్ని అందుకొంటున్నాయి. ఇంతవరకు, నల్లానీటి సరఫరా సౌకర్యాన్ని 7.72 లక్షల (76 శాతం) పాఠశాలల్లోను, 7.48 లక్షల (67.5 శాతం) ఆంగన్ వాడీ సెంటర్ ల లోను ఏర్పాటు చేయడమైంది.

ప్రధాన మంత్రి ప్రస్తావిస్తున్న 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' దృష్టి కోణాన్ని ఆచరణ లోకి తీసుకు రావడం కోసం, అలాగే, 'అట్టడుగున ఉన్నవారికి' అన్ని సౌకర్యాల ను కల్పించే క్రమం లో భాగం గా 'జల్ జీవన్ మిశన్' ను రాష్ట్రాల భాగస్వామ్యం ద్వారా 3.60 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ తో అమలు లోకి తీసుకు రావడమైంది. అంతకు మించి 2021-22 నుంచి 2025-26 సంవత్సరాల మధ్య కాలం లో పల్లెల లో నీరు, పారిశుధ్యం సంబంధి సదుపాయాల కల్పన కై 15వ ఆర్థిక సంఘం సూచన మేరకు 1.42 లక్షల కోట్ల రూపాయల ను అనుబంధ గ్రాంట్ల రూపం లో పిఆర్ఐ లకు కేటాయించడం జరిగింది.

అంటార్కిటిక్ పర్యావరణాన్ని పరిరక్షించడానికి మరియు తూర్పు అంటార్కిటికా మరియు వెడ్డెల్ సముద్రాన్ని సముద్ర రక్షిత ప్రాంతాలుగా (ఎంపిఏలు) ప్రకటించడానికి భారతదేశం మద్దతు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:అంటార్కిటిక్ పర్యావరణాన్ని పరిరక్షించడానికి మరియు తూర్పు అంటార్కిటికా మరియు వెడ్డెల్ సముద్రాన్ని సముద్ర రక్షిత ప్రాంతాలుగా పేర్కొనడానికి యూరోపియన్ యూనియన్ ప్రతిపాదనకు సహ స్పాన్సర్ చేసినందుకు నిన్న సాయంత్రం నిర్వహించిన ఉన్నత స్థాయి మంత్రివర్గ సమావేశంలో భారతదేశం మద్దతునిచ్చింది.

దీనిని కేంద్ర సహాయ మంత్రిత్వశాఖ (ఇండిపెండెంట్ ఛార్జ్) సైన్స్ ఉ టెక్నాలజీ ధృవీకరించింది; మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ (ఇండిపెండెంట్ ఛార్జ్) ఎర్త్ సైన్సెస్; ఎంఓఎస్ పిఎంఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ మరియు స్పేస్ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వర్చువల్‌గా జరిగిన సమావేశంలో యూరోపియన్ యూనియన్‌కు చెందిన వివిధ దేశాల మంత్రులను ఉద్దేశించి ప్రసంగించారు.

సమావేశంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ "అంటార్కిటిక్ పర్యావరణాన్ని పరిరక్షించడంలో భారతదేశం సుస్థిరతకు మద్దతు ఇస్తుంది'' అని తెలిపారు. చట్టవిరుద్ధమైన మరియు నియంత్రణ లేని చేపల వేటను నియంత్రించడానికి రెండు ప్రతిపాదిత ఎంపిఏలు అవసరం అని ఆయన అన్నారు. కమిషన్ ఫర్ ద కన్జర్వేషన్ ఆఫ్ అంటార్కిటిక్ మెరైన్ లివింగ్ రిసోర్సెస్ (సిసిఎఎంఎల్ఆర్) సభ్య దేశాల పరిరక్షణ కమిషన్‌ను భవిష్యత్తులో ఈ ఎంపీఏల సూత్రీకరణ, అనుసరణ మరియు అమలు యంత్రాంగాలతో ముడిపడి ఉండేలా చూడాలని ఆయన కోరారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ తూర్పు అంటార్కిటికా మరియు వెడ్డెల్ సముద్రాన్ని ఎంపిఏలుగా ప్రతిపాదించాలనే ప్రతిపాదన మొదటగా 2020 లో సిసిఎఎంఎల్ఆర్‌కి అందించబడింది. అయితే ఆ సమయంలో ఈ అంశంపై ఏకాభిప్రాయానికి రాలేదని అన్నారు. అప్పటి నుండి ఆస్ట్రేలియా, నార్వే, ఉరుగ్వే మరియు యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతిపాదనకు సహ-స్పాన్సర్ చేయడానికి అంగీకరించడంతో గణనీయమైన పురోగతి సాధించామని ఆయన చెప్పారు. అక్టోబర్ 2021 చివరి నాటికి ఎంపిఏ ప్రతిపాదనలకు సహ-స్పాన్సర్ చేయడంలో భారతదేశం ఈ దేశాలతో చేరనున్నట్లు మంత్రి తెలిపారు.భారతదేశం 1981 లో దక్షిణ హిందూ మహాసముద్ర రంగం ద్వారా అంటార్కిటిక్ యాత్రను ప్రారంభించిందని, అప్పటి నుండి ఈ రోజు వరకూ వెనక్కి తిరిగి చూడలేదని డాక్టర్ జితేంద్ర సింగ్ ఈయూ ప్రతినిధులకు చెప్పారు. భారతదేశం 40 యాత్రలను పూర్తి చేసింది మరియు 2021-22లో 41 వ యాత్రకు సంబంధించిన ప్రణాళికలతో సిద్ధమవుతోందని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో భారతదేశం తన అంటార్కిటిక్ దృష్టిని నిలబెట్టుకోవడంలో తన ఆసక్తులను పటిష్టం చేసుకుందని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ " సిసిఎఎమ్ఎల్ఆర్‌లో ఎంపిఏ ప్రతిపాదనకు సహస్పాన్సర్ చేయడం మరియు అర్జెంటీనా, బ్రెజిల్, చిలీ, కొరియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా మరియు యుఎస్ఏ వంటి దేశాలతో సమన్వయం చేసుకోవడం ఇదే మొదటిసారి. ఎంపిఏ ప్రతిపాదనలకు మద్దతునివ్వడం మరియు సహ-స్పాన్సర్ చేయడాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్న భారతదేశ నిర్ణయం పరిరక్షణ మరియు స్థిరమైన వినియోగ సూత్రాల ద్వారా మరియు ప్రపంచ సహకార చట్రాలకు (సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, మహాసముద్రాల దశాబ్దం, జీవవైవిధ్యంపై కన్వెన్షన్ మొదలైనవి) భారతదేశం సంతకం చేసిన వాటిని అనుసరిస్తుందని మంత్రి అన్నారు.

వర్చువల్ విధానంలో జరిగిన ఈ అత్యున్నత స్థాయి మంత్రివర్గ సమావేశం పర్యావరణం, మహాసముద్రాలు మరియు మత్స్యశాఖ కమీషనర్ వర్జినిజున్ సింకేవిసియస్, ఈయూ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. దీనికి దాదాపు 18 దేశాల నుండి మంత్రులు, రాయబారులు మరియు దేశ కమిషనర్లు హాజరయ్యారు. ఈ సమావేశం ఎంపిఏ ప్రతిపాదనల సహ-స్పాన్సర్‌ల సంఖ్యను పెంచడం మరియు సిసిఎఎమ్ఎల్ఆర్ ద్వారా వారి వేగవంతమైన దత్తత కోసం ఉమ్మడి వ్యూహం మరియు భవిష్యత్తు చర్యలపై ప్రతిబింబించడం లక్ష్యంగా పెట్టుకుంది.

సిసిఎఎమ్ఎల్ఆర్ అనేది మొత్తం అంటార్కిటిక్ సముద్ర పర్యావరణ వ్యవస్థకు సంబంధించిన జాతుల వైవిధ్యాన్ని మరియు స్థిరత్వాన్ని కాపాడటానికి అంటార్కిటిక్ మత్స్య సంపదను నిర్వహించడానికి ఒక అంతర్జాతీయ ఒప్పందం. సిసిఎఎఎంఎల్ఆర్ ఏప్రిల్ 1982 లో అమల్లోకి వచ్చింది. 1986 నుండి సిసిఎఎమ్ ఎల్ ఆర్‌లో భారతదేశం శాశ్వత సభ్యదేశంగా ఉంది. సిసిఎఎమ్ఎల్ఆర్ వ్యవహారాలను భారతదేశంలో భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ద్వారా దాని అనుబంధ కార్యాలయం, సెంటర్ ఫర్ మెరైన్ లివింగ్ రిసోర్సెస్ అండ్ ఎకాలజీ (సిఎంఎల్ఆర్ఈ) కొచ్చి, కేరళ ద్వారా సమన్వయం చేయబడింది.

ఎంపిఏ అనేది సముద్ర సంరక్షిత ప్రాంతం. ఇది దాని సహజ వనరులలో లేదా కొంత భాగానికి రక్షణను అందిస్తుంది. ఎంపిఏలోని కొన్ని కార్యకలాపాలు నిర్దిష్ట పరిరక్షణ, నివాస రక్షణ, పర్యావరణ వ్యవస్థ పర్యవేక్షణ లేదా మత్స్య నిర్వహణ లక్ష్యాలను చేరుకోవడానికి పరిమితం లేదా నిషేధించబడ్డాయి. 2009 నుండి సిసిఎఎమ్ఎల్ఆర్ సభ్యదేశాలు దక్షిణ మహాసముద్రంలోని వివిధ ప్రాంతాలకు ఎంపీఏల కొరకు ప్రతిపాదనలను అభివృద్ధి చేశాయి. సిసిఎఎమ్ఎల్ఆర్‌కు చెందిన శాస్త్రీయ కమిటీ ఈ ప్రతిపాదనలను పరిశీలిస్తుంది. సిసిఎఎమ్ఎల్ఆర్ సభ్యదేశాలు వాటిని అంగీకరించిన తర్వాత విస్తృతమైన పరిరక్షణ చర్యలు దాని ద్వారా నిర్దేశించబడతాయి.

అల్లు రామలింగయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మెగాస్టార్ చిరంజీవి..

అమరావతి, , అక్టోబర్ 1:రాజమండ్రి హోమియోపతి మెడికల్ కళాశాలలో అల్లు రామలింగయ్య విగ్రహాన్ని మెగాస్టార్ చిరంజీవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. నటుడిగా తాను జన్మించింది రాజమండ్రిలోనేనని.. తన మొదటి మూడు సినిమాలు రాజమండ్రి ప్రాంతంలో చిత్రీకరణ జరిగాయని వెల్లడించారు. తనది అల్లు రామలింగయ్యగారిది గురు శిష్యుల సంబంధమన్నారు. సమయానికి భోజనం చేయకపోవడం వల్ల తనకు కడుపులో మంట వచ్చేదని ఎన్ని యాంటాసిడ్లు వాడినా కడుపులో మంట తగ్గలేదన్నారు.

అల్లు రామలింగయ్యగారు ఒకసారి ఇచ్చిన హోమియో మందుతో నొప్పి తీసినట్లు పోయిందని ఇవాళ్టికీ మా ఫ్యామిలీ హోమియోపతి మందులే వాడతామని స్పష్టం చేశారు. హోమియోపతిలో తగ్గని జబ్బు లేదని.. రాజ్యసభ ఎం.పి.గా ఉండటం వల్లే అన్ని ప్రాంతాల్లో అభివృద్ధికి నిధులు ఇవ్వగలిగానని చెప్పారు. సంజీవని లాంటి హోమియోపతి వైద్యం చిరంజీవిగా ఉండాలని హోమియోపతి సైడ్ ఎఫక్ట్స్ లేని వైద్యమన్నారు.

టీఆర్ఎస్ సర్కార్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశంసలు

హైదరాబాద్ , అక్టోబర్ 1:కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం శాసనమండలిలో తెలంగాణ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. పరిశ్రమలు, ఐటీ రంగంలో తెలంగాణ సాధించిన వృద్ధి విషయంలో ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవని స్పష్టం చేశారు. ఉద్యోగాలు, ఐటీ ఎగుమతులు, పరిశ్రమల ఏర్పాటు విషయంలో తెలంగాణ ప్రభుత్వం చెబుతున్న గణాంకాలతో ఆయన ఏకీభవించారు.

కిటెక్స్ వస్త్ర పరిశ్రమ వంటి ప్రముఖ పరిశ్రమను తెలంగాణకు తీసుకురావడం గొప్ప విషయం అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మంచి పని చేశారని మెచ్చుకున్నారు. పరిశ్రమలు, ఐటీ వృద్ధి అంశంపై మండలిలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. పెద్ద సంఖ్యలో ఉన్న ఐటీ ఉద్యోగాల్లో తెలంగాణ యువతకు ఎక్కువగా అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దీనికి స్పందించిన ఐటీ మంత్రి కేటీఆర్.. పరిశ్రమల్లో తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించే విషయంలో ప్రత్యేక విధానాన్ని అనుసరిస్తున్నామని, కంపెనీల ఇష్టానుసారం ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే ప్రత్యేకంగా రాయితీలు, ప్రోత్సహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కంపెనీలకు, స్థానిక యువతకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు కేటీఆర్ తెలిపారు.

ప్రజా ఉద్యమంగా హరితహారం : ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

హైదరాబాద్ , అక్టోబర్ 1: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం ప్రజా ఉద్యమంగా మారిందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. శాసనసభలో హరితహారంపై స్వల్పకాలిక చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమం సీఎం కేసీఆర్ మానస పుత్రిక అని పేర్కొన్నారు. 24 శాతం ఉన్న గ్రీనరీని పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో తామంతా భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో 3.67 శాతం గ్రీనరీ పెరిగింది. ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చైనా, బ్రెజిల్ తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేపట్టి భారతదేశానికే పేరు తెచ్చిందన్నారు.

సీఎం కేసీఆర్ ఇచ్చే నినాదం ప్రపంచ వ్యాప్తంగా వ్యాపిస్తోంది. ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్ ఉద్యమంలా కొనసాగుతోంది. సీఎం కేస

ఆర్థిక సంవత్సరం 2021-22కు గాను ఆగస్టు నెలవరకు భారత ప్రభుత్వ ఖాతాల సమీక్ష

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:భారత ప్రభుత్వ నెలవారీ ఖాతాలను ఆగస్టు, 2021వరకు ఏకీకృతం చేసి, నివేదికలను ముద్రించడం జరిగింది. ముఖ్యాంశాలను దిగువన పేర్కొనడం జరిగింది –

భారత ప్రభుత్వం ఆగస్టు 2021వరకు రూ. 8,08,672 కోట్లు (బడ్జెట్ 2021–22 మొత్తం ఆదాయంలో 40.9%) ఆర్జించింది. ఇందులో రూ. 6,44,843 కోట్లు పన్ను ఆదాయం (కేంద్రానికి నికరంగా) కాగా, రూ. 1,48,650 కోట్ల పన్నేతర ఆదాయం, రూ. 6,808 కోట్లను రుణరికవరీ నుంచి, రూ. 8,371 కోట్లను వివిధ మూలధన ఆదాయం నుంచి కలిపి మొత్తంగా రూ. 15,179 కోట్ల రుణరహిత ఆదాయాన్ని ఆర్జించింది. భారత ప్రభుత్వం ఆగస్టు 2021వరకు చేయవలసిన పన్నుల వాటా పంపిణీలో భాగంగా రూ. 2,12, 606 కోట్లను రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేయడం జరిగింది.

భారత ప్రభుత్వం చేసిన వ్యయం రూ. 12, 76, 681 కోట్ల (బడ్జెట్ 2021–22 మొత్తం ఆదాయంలో 36.7%). ఇందులో రూ. 11,04,813 కోట్లు ఆదాయపు ఖాతాపైగా, రూ. 1,71,868 కోట్లు మూలధనం ఖాతాపై. మొత్తం రెవిన్యూ వ్యయంలో రూ. 2,78,371 కోట్లు వడ్డీ చెల్లింపులకు, రూ. 1,47,398 కోట్లు ప్రధాన సబ్సిడీలకు ఖర్చు చేయడం జరిగింది.

రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకున్నా 0.25 శాతం మందికి కరోనా..!

ముంబై, అక్టోబర్ 1:: మహారాష్ట్రలో ప్రజల నిర్లక్ష్యం కారణంగా కరోనా మహమ్మారి విస్తరిస్తున్నదని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కరోనా పరిస్థితిపై తమ ప్రభుత్వం సర్వే నిర్వహించిందని, సింగిల్ డోస్ వ్యాక్సిన్ తీసుకున్నవారిలో 0.19 శాతం మందికి, రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకున్న వారిలో 0.25 శాతం మందికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు సర్వేలో తేలిందని ఆయన చెప్పారు.

రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకున్నప్పటికీ అంతమందికి కరోనా పాజిటివ్ రావడంతో తాము ఆరోగ్య నిపుణులను ఆరా తీశామని, అయితే వ్యాక్సిన్ తీసుకున్న వారిలో చాలామంది కొవిడ్ నిబంధనలు పాటించకపోవడమే ఇందుకు కారణమని వారు చెప్పారని అజిత్ పవార్ తెలిపారు. ప్రభుత్వం నిబంధనలు సడలించినప్పుడు ప్రజలు స్వచ్ఛందంగా కొవిడ్ నిబంధనలు పాటించాలని, లేదంటే వైరస్ విస్తృతి ఇలాగే కొనసాగుతుందని ఆరోగ్య నిపుణులు చెప్పినట్లు ఆయన వెల్లడించారు.

కోవీషీల్డ్‌కు ఆమోదం తెలిపిన ఆస్ట్రేలియా

సిడ్నీ, అక్టోబర్ 1: కోవీషీల్డ్ టీకాకు ఆస్ట్రేలియా వైద్య నియంత్రణ మండలి ఆమోదం తెలిపింది. భారత్‌కు చెందిన సీరం సంస్థ .. కోవీషీల్డ్ కోవిడ్ టీకాలను తయారు చేస్తున్న విషయం తెలిసిందే. కోవీషీల్డ్ టీకా తీసుకున్న భారతీయులు ఇక నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించవచ్చు. ఆస్ట్రేలియా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వేలాది మంది ఇండియన్లకు ఊరటనిచ్చింది. కోవీషీల్డ్‌తో పాటు చైనాకు చెందిన సైనోవాక్ టీకాలు ఇస్తున్న రక్షణ పట్ల ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్ సంతృప్తి వ్యక్తం చేశారు. మరో వైపు అంతర్జాతీయ ప్రయాణికులపై ఉన్న ఆంక్షలను కూడా ఆస్ట్రేలియా ప్రభుత్వం ఎత్తివేయనున్నది. నవంబర్ నుంచి విదేశీ ప్రయాణికులు రావచ్చు అంటూ ఇవాళ ఆ దేశం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రయాణికులపై గత 18 నెలలుగా ఉన్న నిషేధాన్ని ఆస్ట్రేలియా ఎత్తివేసింది. సైనోవాక్, కోవీషీల్డ్ టీకాలు వేసుకున్న అంతర్జాతీయ ప్రయాణికులకు ఆటంకాలు ఉండవని స్కాట్ తెలిపారు.

గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి: ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్

జమ్మికుంట, అక్టోబర్ 1:: టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ కోరారు. శుక్రవారం ఆయన జమ్మికుంట పట్టణంలోని 8, 22 వ వార్డుల్లో పర్యటించారు. స్థానిక కాలనీవాసులను కలిశారు.

సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్వీకరించారు. సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పరిష్కార మార్గాలు చూపారు. అనంతరం ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ? జమ్మికుంట అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నిధుల వరద పారిస్తున్నరని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లోపు పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

గతంలో మంత్రిగా పని చేసిన ఈటల రాజేందర్ ఇక్కడి అభివృద్ధిని పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈటల రాజేందర్ బీజేపీలో చేరి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఆయన కుట్రలను భగ్నం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్ అండగా నిలువాలని కోరారు. ఆయన వెంట ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులున్నారు.

'మా' ఎన్నికల బరి నుంచి తప్పుకున్న బండ్ల గణేష్

హైదరాబాద్ , అక్టోబర్ 1:మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) ఎన్నికలు ఆసక్తి రేపుతున్నాయి. 'మా' ఎన్నికల బరి నుంచి ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ తప్పుకున్నారు. మా జనరల్ సెక్రటరీ పదవికి పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. తన ఆత్మీయులు, శ్రేయోభిలాషుల సూచన మేరకు మా జనరల్ సెక్రటరీ నామినేషన్ ఉపసంహరించున్నట్లు తెలిపారు.

మా ఎన్నికల్లో అధ్యక్ష పదవికి సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్, యంగ్ హీరో విష్ణు మధ్య పోటీ గట్టిగా ఉంది. 'మా' ఎన్నికలు అక్టోబరు 10న జరగనున్నాయి. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ హైదరాబాద్ జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కృష్ణమోహన్ తెలిపారు. ఎనిమిది మంది ఆఫీస్ బేరర్స్ 18 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌తో కూడిన కమిటీకి ఈ ఎన్నికలు జరగనున్నాయి.

జిల్లా ఆసుపత్రుల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలపై నివేదిక విడుదల చేసిన నీతీ ఆయోగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:దేశంలో జిల్లా ఆసుపత్రుల పనితీరుపై రూపొందించిన నివేదికను నీతీ ఆయోగ్ ఈ రోజు విడుదల చేసింది. ఆసుపత్రుల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలు పేరిట ఈ నివేదికను నీతీ ఆయోగ్ సిద్ధం చేసింది. ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ప్రపంచ ఆరోగ్య సంస్థ భారతదేశ శాఖ సహకారంతో జిల్లా ఆసుపత్రుల పని తీరును నీతీ ఆయోగ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. క్వాలిటీ కౌన్సిల్ అఫ్ ఇండియా అనుబంధ సంస్థ అయిన నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ సమాచారాన్ని విశ్లేషించింది.

నివేదికను విడుదల చేయడానికి ఏర్పాటైన సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి. కె. పాల్, సీఈఓ అమితాబ్ కాంత్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేశ్ సర్వాల్,అదనపు కార్యదర్శి ఆర్తి అహుజా, భారతదేశంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ రోడెరికో ఆఫ్రిన్,క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇది చైర్మన్ అదిల్ జైనుల్‌భాయ్ పాల్గొన్నారు.

దేశ ఆరోగ్య రంగంలో జిల్లా స్థాయి ఆసుపత్రులు నిర్వహిస్తున్న పాత్ర, వాటి ప్రాధాన్యతను నివేదికలో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి. కె. పాల్ ప్రస్తావించారు. అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు జిల్లా ఆసుపత్రులు వివిధ రకాల వైద్య సేవలను అందిస్తూ వారి ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తున్నాయని ఆయన అన్నారు. అయితే, ప్రధానమైన జిల్లా ఆసుపత్రులు మానవ వనరులు, సామర్థ్యం, వనరుల వినియోగం, పని ఒత్తిడి లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు. ప్రజలందరికి ఆరోగ్య సంరక్షణ అందించేందుకు ఈ సమస్యలను పరిష్కరించవలసి ఉంటుందని అన్నారు. జిల్లా ఆసుపత్రుల పనితీరుపై నీతీ ఆయోగ్ చేపట్టిన అధ్యయనంతో ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.

దేశంలో జిల్లా ఆసుపత్రుల పనితీరుపై తొలిసారిగా అధ్యయనం జరిగిందని నీతీ ఆయోగ్ సీఈఓ శ్రీ అమితాబ్ కాంత్ తెలిపారు. సమాచార ఆధారిత పరిపాలన, ప్రజలకు మెరుగైన సేవలను అందుబాటులోకి తెచ్చే అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ అధ్యయనం నిర్వహించామని ఆయన వివరించారు. వివిధ ప్రాంతాల్లో వైద్య సేవల రంగాన్ని ప్రక్షాళన చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన వివరించారు.

వ్యవస్థ, పనితీరు అంశాలకు సంబంధించి 10 సూచిక ఆధారంగా నీతీ ఆయోగ్ జిల్లా ఆసుపత్రుల పనితీరును మదింపు వేసింది. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న 707 జిల్లా ఆసుపత్రుల పనితీరును మదింపు చేయడం జరిగింది. 2017–18 సంవత్సరానికి సంబంధించిన సమాచారం ఆధారంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికోసం ఆసుపత్రులను మూడు తరగతులుగా విభజించడం జరిగింది. చిన్న ఆసుపత్రులు (200 పడకల కంటే తక్కువ లేదా సమానం), మధ్య–పరిమాణ ఆసుపత్రులు (201?300 పడకల మధ్య) మరియు పెద్ద ఆసుపత్రులు (300 కంటే ఎక్కువ పడకలు) తరగతిలో ఈ అధ్యయనం జరిగింది. 10 సూచికలలో ప్రతి ఆసుపత్రి కేటగిరీలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన జిల్లా ఆస్పత్రిలో అనుసరించిన ఉత్తమ విధానాలను నివేదికలో పొందుపరిచారు.

పడకల లభ్యత, వైద్య మరియు పారామెడికల్ సిబ్బంది, ప్రధాన ఆరోగ్య పరీక్షల సౌకర్యాలు సహా రోగుల సంఖ్య, ఒక సర్జన్ చేసిన శస్త్రచికిత్సల సంఖ్య లాంటి సూచికల ఆధారంగా సాగిన అధ్యయనంలో 24 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో పనిచేస్తున్న 75 జిల్లా ఆసుపత్రులు ఉత్తమ పనితీరును కనబరిచాయి..

ఆరోగ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న కొన్ని కీలక సమస్యలను కూడా ఈ నివేదిక ప్రస్తావించింది. దేశంలో జిల్లా ఆసుపత్రుల పనితీరును మెరుగుపరచడానికి అమలు చయవలసిన చర్యలను నివేదికలో సూచించారు. దేశంలో ఆరోగ్య రంగ యాజమాన్య నిర్వహణ సమాచారాన్ని మరింత మెరుగుపరచడానికి, ఆరోగ్య సంరక్షణ రంగంలో జవాబుదారీతనం తీసుకురావడానికి అమలు చేయాల్సిన చర్యలను నివేదికలో పొందుపరిచారు. ఈ నివేదిక దేశంలో జిల్లా ఆసుపత్రులను అభివృద్ధి చేయడానికి ఒక కార్యాచరణ కార్యక్రమం సిద్ధం చేయడానికి పునాదిగా ఉపయోగపడుతుంది.

రాజస్థాన్ లోని నాలుగు జిల్లా వైద్య కళాశాలలకు శంకుస్థాపనల తో పాటు సి.ఐ.పి.ఈ.టి-జైపూర్ ను ప్రారంభించిన - ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు రాజస్థాన్ లోని నాలుగు జిల్లా వైద్య కళాశాలలతో పాటు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ ఉ టెక్నాలజీ (సి.ఐ.పి.ఈ.టి) జైపూర్ కి శంకుస్థాపనలు చేశారు. లోక్ సభ స్పీకర్, శ్రీ ఓం బిర్లా; రాజస్థాన్ ముఖ్యమంత్రి, శ్రీ అశోక్ గెహ్లోట్; కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి, శ్రీ మన్సుఖ్ మాండవీయ; కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి, డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ ల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ నాలుగు వైద్య కళాశాలలు సిరోహి, హనుమాన్‌గఢ్, బాన్స్వారా మరియు దౌసా జిల్లాల ప్రజలకు అందుబాటులో సేవలు అందిస్తాయి.

గుజరాత్ ముఖ్యమంత్రిగా తన అనుభవం బహుళ ఆరోగ్య వ్యవస్థలను కలిగి ఉండటం వలన దేశంలోని ఆరోగ్య రంగంలోని లోపాలపై అంతర్దృష్టిని అందించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. "మేము దేశ ఆరోగ్య రంగాన్ని మార్చడానికి జాతీయ విధానం మరియు జాతీయ ఆరోగ్య విధానంపై పనిచేశాము. స్వచ్ఛ భారత్ అభియాన్ నుండి ఆయుష్మాన్ భారత్ మరియు ఇప్పుడు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ వరకు, ఇటువంటి అనేక ప్రయత్నాలు ఈ విధానంలో భాగంగా చేపట్టాము." అని ఆయన వివరించారు. ఆయుష్మాన్ భారత్ యోజన కింద రాజస్థాన్ లోని 2,500 ఆరోగ్య కేంద్రాల ద్వారా దాదాపు 3 లక్షల 50 వేల మంది ఉచిత చికిత్స పొందారని ఆయన చెప్పారు.

ఆశావహ జిల్లాల్లోని వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అప్ గ్రేడ్ తో ఎయిమ్స్ నెట్–వర్క్ ను 6 నుండి 22 వరకు విస్తరించడం ద్వారా ఆరోగ్య సంరక్షణలో ప్రాంతీయ అసమతుల్యతను సరిచేయడానికి భారత ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని ప్రధానమంత్రి ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. గత 6–7 సంవత్సరాలలో, 170 కి పైగా కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేయగా, 100 కి పైగా వైద్య కళాశాలల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. 2014 లో, దేశంలో వైద్య కోర్సుల్లో అండర్–గ్రాడ్యుయేట్లు, పోస్ట్–గ్రాడ్యుయేట్ల మొత్తం సీట్లు 82,000 గా ఉండగా, ఈ రోజున ఆ సంఖ్య 1,40,000 కు పెరిగింది. అదే విధంగా, గతంలో, రాజస్థాన్ లో వైద్య కోర్సుల్లో సుమారు 2,000 అండర్–గ్రాడ్యుయేట్ సీట్లు, 1000 కంటే తక్కువగా పోస్ట్–గ్రాడ్యుయేట్ సీట్లు ఉండగా, ఇప్పుడు, అండర్–గ్రాడ్యుయేట్ సీట్లు 4,000 కు, పోస్ట్–గ్రాడ్యుయేట్ సీట్లు 2,100 కు పెరిగాయి. జాతీయ వైద్య కమిషన్ జోక్యంతో, వైద్య విద్యలో అక్రమాల సమస్య పరిష్కారమైందని ఆయన అన్నారు.

'ఉచిత టీకా, అందరికీ టీకా' ప్రచారం విజయవంతం కావడాన్ని కూడా ప్రధానమంత్రి ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. భారతదేశంలో 88 కోట్లకు పైగా కరోనా టీకాలు వేయగా, రాజస్థాన్ లో 5 కోట్ల కంటే ఎక్కువగా టీకా మోతాదులు ఇవ్వడం జరిగింది.

పెట్రో–కెమికల్ పరిశ్రమ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలకు, ప్రస్తుతం నైపుణ్యం కలిగిన మానవవనరుల అవసరం ఎంతైనా ఉంది, ప్రధానమంత్రి పేర్కొన్నారు. కొత్త సి.ఐ.పి.ఈ.టి. : ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్ టెక్నాలజీ సంస్థ లక్షలాది మంది యువతను కొత్త అవకాశాలతో అనుసంధానిస్తుందని ఆయన అన్నారు. మరుగుదొడ్లు, విద్యుత్, గ్యాస్ కనెక్షన్ల రాక ద్వారా ప్రవేశపెట్టిన జీవన సౌలభ్యం గురించి కూడా ఆయన ప్రత్యకంగా ప్రస్తావించారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం పట్ల శ్రీ మన్సుఖ్ మాండవీయ కృతజ్ఞతలు తెలియజేస్తూ, "ఆరోగ్యాన్ని అభివృద్ధితో ముడిపెట్టిన మొదటి పరిపాలనా దక్షుడు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు. ఆయన, ఈ అక్టోబర్ 7వ తేదీన 20 సంవత్సరాల ప్రజా సేవను పూర్తి చేస్తున్నందున, సబ్–కా–సాథ్–సబ్–కా–వికాస్ పిలుపుని ప్రతిబింబించే విధంగా ఆరోగ్య రంగంలో ఆయన సాధించిన విజయాలను తిరిగి చూడకుండా ఎవరూ ఉండలేరు. గుజరాత్ లో ముఖ్యమంత్రి అమృతం యోజన ద్వారా ప్రైవేట్ ఆసుపత్రుల్లో 2 లక్షల రూపాయల వరకు చికిత్స అందిస్తుండగా, చిరంజీవి యోజన ద్వారా తల్లులు తమ డెలివరీ కోసం ప్రైవేట్ సదుపాయాలను ఉపయోగించుకోవచ్చు. యుష్మాన్ భారత్ 2 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు వారి రాష్ట్రాల వెలుపల వలస కార్మికులకు లబ్ధి చేకూరే విధంగా 5 లక్షల రూపాయలవరకు చికిత్సను పొందేలా చేసింది ." అని ఆయన తెలియజేశారు.

రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఎం.ఎన్.ఎం.ఈ. రంగం కోసం సి.ఐ.పి.ఈ.టి., జైపూర్ యొక్క ప్రాముఖ్యత గురించి కూడా ఆయన ప్రత్యేకంగా పేర్కొన్నారు. నంన్మ–పరిశ్రమ అనుసంధానాన్ని, పటిష్ఠపరుస్తూ, నైపుణ్యం కలిగిన కార్మికులను అందుబాటులోకి తేవడంతో పాటు, వివిధ సంస్థలకు సహాయపడే పరిశోధనను ఈ సంస్థలు చేపడతాయి. వాటి పరీక్షా సౌకర్యాలను నాణ్యత నియంత్రణ కోసం ఉపయోగించడానికి అనుమతిస్తాయి. దేశంలో 42 ఇలాంటి సంస్థలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. "విద్యా సంస్థల నుండి పరిశ్రమలకు" అనే సూత్రం పై పని చేస్తూ, లక్షకు పైగా విద్యార్థులు ఏటా ఈ సంస్థల్లో వివిధ రంగాలలో శిక్షణ పొందుతున్నారు. ఈ విద్యార్థుల్లో గరిష్టంగా దాదాపు 99 శాతం మందికి ఉపాధి ఖచ్చితంగా లభిస్తుంది. ప్రధానంగా గిరిజన మరియు అభివృద్ధి చెందని నాలుగు జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నందుకు శ్రీ ఓం బిర్లా ప్రధాన మంత్రి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, "సరసమైన వైద్య విద్య తో పాటు మంచి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా స్థానిక ప్రజలు ఎంతో ప్రయోజనం పొందుతారు.'' అని పేర్కొన్నారు. జైపూర్ లో సి.ఐ.పి. ఈ.టి–ఐ.పి.టి. ఏర్పాటు చేసినందుకు కూడా ఆయన ప్రధానమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. "ఆత్మ నిర్భర్–భారత్ దిశగా ఇది ఒక కీలకమైన చర్య" అని ఆయన అభివర్ణించారు. ఇది ప్రధానమంత్రి 'నూతన భారతదేశ స్వప్నాన్ని నెరవేర్చే దిశగా తోడ్పడుతుందని, ఆయన అన్నారు.

సి.ఐ.పి.ఈ.టి–ఐ.పి.టి. తో పాటు రాజస్థాన్ లోని సిరోహి, హనుమాన్–గఢ్, బన్స్వారా, దౌసా లలో నాలుగు వైద్య కళాశాలలు నెలకొల్పుతున్నందుకు, శ్రీ అశోక్ గెహ్లోట్, ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. గత పది సంవత్సరాల లో దేశంలో వైద్య విద్య బాగా విస్తరించిన నేపథ్యంలో, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో, ముఖ్యంగా వెనుకబడిన మరియు గిరిజన జిల్లాలో ఒక వైద్య కళాశాల చొప్పున ఏర్పాటు చేయడంలో సహకారం అందించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో – కేంద్ర కార్మిక, ఉపాధి, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు శాఖల మంత్రి, శ్రీ భూపేందర్ యాదవ్; కేంద్ర జల శక్తి శాఖ మంత్రి, శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్; కేంద్ర నూతన, పునరుత్పాదక విద్యుత్తు, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి, శ్రీ భగవంత్ ఖుబా; కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి, శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్; కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి, శ్రీ కైలాష్ చౌదరి; రాజస్థాన్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, శ్రీ రఘు శర్మ; మాజీ ముఖ్యమంత్రి, శ్రీమతి వసుంధర రాజే సింధియా; రాజస్థాన్, ప్రతిపక్ష నాయకుడు, శ్రీ గులాబ్ చంద్ కటారియా తో పాటు, రాష్ట్రానికి చెందిన పలువురు ఎన్నికైన ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

ఈటల ఓ అసమర్థుడు.. కేసీఆర్‌ను వెన్నుపోటు పొడవాలనే కుట్ర.. : మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి

హైదరాబాద్ , అక్టోబర్ 1:అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా.. కేసీఆర్‌ను ఎలా వెన్నుపోటు పొడవాలా? అని ఎదురుచూసిన వ్యక్తి ఈటల రాజేందర్ అని మాజీమంత్రి ఇనుగాలి పెద్దిరెడ్డి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ ఉప ఎన్నిక టీఆర్ఎస్ అభ్యర్థిగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ నామినేషన్ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "నాలుగుసార్లు ఎమ్మెల్యేగా టీఆర్ఎస్ అవకాశం ఇచ్చినా.. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు పట్టకుండా.. అవకాశం ఇచ్చిన వారిపైనే కక్షకట్టిన దుర్మార్గుడు ఈటల. హుజూరాబాద్ అభివృద్ధి పట్టకుండా నిత్యం వ్యాపారాలు, సెటిల్‌మెంట్లతో బీజీగా ఉన్న ఈటల.. ఎప్పుడూ టీఆర్ఎస్ అభివృద్ధికి కృషి చేయలేదని అన్నారు.

ఏ నాయకుడైనా ప్రజా సమస్యలు పరిష్కారం కోరుతూ పదవులకు రాజీనామా చేస్తాడు. మరీ ఈయన ఏ సమస్య కోసం రాజీనామా చేశాడు? ఆస్తులు ఎక్కువై, సంపాదన పెరిగిపోయి దానిని కాపాడుకోవాలనే దురుద్దేశంతోనే రాజీనామా చేసి, బీజేపీ జపం చేస్తున్నాడు. అభివృద్ధి అంటే ఏమిటో రెండు నెలల్లో మంత్రి హరీష్ రావు చేసి చూపించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన పార్టీని కాదని, ఎంతో ప్రోత్సహించిన సీఎం కేసీఆర్‌కు గోరీ కడతామని అవాకులు, చెవాకులు పేలుకుతున్నాడు. హుజూరాబాద్‌ను అభివృద్ధి చేయని అసమర్థుడు ఈటల రాజేందర్. అతనికి ఓట్లు వేస్తే అభివృద్ధికి మరింత దూరం అవుతుంది హుజూరాబాద్. మనం బాగుపడాలంటే టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను గెలిపించుకోవాలి" అని కోరా

జేఎన్‌టీయూలో కొత్త కోర్సులు.. 30న గోల్డెన్ జూబ్లీ వేడుకలు ప్రారంభం

హైదరాబాద్ , అక్టోబర్ 1: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఈ నెల 30న ప్రారంభంకానున్నాయి. ఏడాది పాటు ఈ వేడుకలు నిర్వహిస్తామని వర్సిటీ వీసీ నర్సింహారెడ్డి తెలిపారు. ఈ నెల 3న జరిగే వేడుకలకు గవర్నర్ హాజరవుతారని చెప్పారు. నవంబరులో 10వ స్నాతకోత్సవం జరుగుతుందని, వర్సిటీ ప్రారంభమై 50 ఏళ్లు గడిచిన సందర్భంగా కొత్త కోర్సులు కూడా ప్రారంభిస్తున్నామని వీసీ వెల్లడించారు. ఈ ఏడాదే కొత్తగా 7 కోర్సులను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సుల వల్ల మరింత మంది విద్యార్థులకు మేలు జరుగుతుందని, కొత్త కెరీర్‌లు ఎంచుకునే అవకాశం దొరుకుతుందని పేర్కొన్నారు.

దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.97 శాతం : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ , అక్టోబర్ 1: తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. శాసనసభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన నాడు దేశం యొక్క జీడీపీలో మన రాష్ట్రం యొక్క జీఎస్‌డీపీ శాతం 4.06గా ఉండేది. అయితే గత ఏడు సంవత్సరాల వరుస పెరుగుదలతో దేశం యొక్క జీడీపీలో మన రాష్ట్రం వాటా 4.97 శాతం పెరిగిందన్నారు. దేశం యొక్క ప్రగతి రేటు కంటే మన ప్రగతి రేటు ఎక్కువగా ఉంది. దేశ వృద్ధికి కూడా తెలంగాణ రాష్ట్రం తోడ్పాటును అందిస్తుంది. దేశంలోనే తెలంగాణ అత్యధిక వృద్ధి రేటు నమోదు చేసింది.

ప్రాథమిక రంగంలో రాష్ట్రం పురోగతి సాధించినట్లు నీతిఆయోగ్ చెప్పింది. సాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం. రైతుబంధు, రైతుబీమా, రైతులకు రుణమాఫీ అమలు చేస్తున్నాం. గొర్రెలు, గేదెల పంపిణీ, డెయిరీ పరిశ్రమను అభివృద్ధి చేస్తున్నాం. వ్యవసాయ, అనుబంధం రంగాలపై ఏడేళ్లలో రూ. 2.5 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఆర్థిక సంఘం సిఫార్సులను పట్టించుకోకుండా కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేసింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మనం కళాకారులం.. కళాకారులుగానే ఉందాం, జీవిద్దాం: ప్రకాష్ రాజ్

రాజఇబినీఎవతీ 1, 2021

మనం కళాకారులం..కళాకారులుగానే ఉందాం, జీవిద్దాం: ప్రకాష్ రాజ్

నేను విశ్వ నటుడిగా ఉన్నాను. కనుక ఏ రాష్ట్రానికో, భాషకో పరిమితం చేయవద్దన్నారు నటుడు ప్రకాష్ రాజ్. ఈ నెల 10వ తేదీన 'మా' ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఏపీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ ని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి తన ప్యానల్ సంపూర్ణ మెజారిటీతో గెలవాలని ఆకాంక్షిస్తున్నట్లుగా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ లో జరిగే చిత్ర నిర్మాణాలలో స్థానిక కళాకారులకు అవకాశాలు కల్పించాలని, అందుకు ప్రకాశ్ రాజ్ తరపు నుండి పూర్తి సహకారం కావాలని వారు కోరారు. ఈ సందర్భంగా ప్రకాష్ రాజు ఏపీ మా ప్రతినిధులతో మాట్లాడుతూ.. మా ఎన్నికలకు గాను సినిమా పరిశ్రమకు సంబంధించిన ప్రతి కార్మికుడి జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండే విధంగా



యూనివర్స్



గాంధీజీ పరిచయం

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన వ్యక్తి గాంధీజీ, గాంధీజీ సత్యం అహింసకు మార్గదర్శకుడు. అహింసా మార్గం ద్వారా స్వేచ్ఛను సాధించవచ్చని ప్రపంచానికి చాటిచెప్పారు. గాంధీజీ ప్రభోదించిన సత్యం, అహింసా, సర్వోదయ, గ్రామస్వరాజ్యం వంటి సిద్ధాంతాలు ఆయనకు ఘనకీర్తిని సంపాదించిపెట్టాయి. దేశవిదేశాల్లో అనేకమంది గాంధీజీని ఆదర్శవంతమైన రోల్‌మోడల్‌గా అనుసరించి వారి బాటలో నడిచారు. గాంధీజీ జయంతి అక్టోబరు, 2ను, 15 జూన్ 2007 న ఐక్యరాజ్య సమితికి చెందిన సాధారణ సభ "అంతర్జాతీయ అహింసా దినోత్సవం"గా ప్రకటించింది. ఇది ప్రతి భారతీయునికి గర్వకారణం. మహాత్మా! 'గాంధీ' లేదా బాపూజీగా పేరుగాంచిన భారతదేశ పితామహుడు "మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ" జయంతిని ప్రతి సంవత్సరం అక్టోబరు, 2 తేదీన జరుపుకోవడం ఆనవాయితీ. గాంధీ శాంతి మరియు సత్యానికి చిహ్నం. ధూమపానం, మద్యపానం, మాంసాహారం వంటి వ్యసనాలకు వ్యతిరేకం.భారత స్వాతంత్ర్య పోరాటం కోసం 'సత్యాగ్రహ' ఉద్యమాన్ని ప్రారంభించి, యావత్ భారత్ ప్రజానీకంలో ఉద్యమస్ఫూర్తి రగిలించిన గాంధీజీ అహింసాయుతంగా, ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశానికి విముక్తి కలిగించడంలో ప్రజలందరినీ ఒక తాటిపై నిలబెట్టి స్వాతంత్ర్యం సాధించడంలో ప్రముఖపాత్ర వహించిన చిరస్మరణీయులు. మహాత్మా గాంధీ "హీరో ఆఫ్ ది నేషన్"గా ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మహనీయులు. మహాత్ముడనీ, జాతిపిత అనీ పేరెన్నిక గన్న గాంధీ అహింసాయుత పోరాటంతోనే, ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశానికి స్వాతంత్ర్యము సాధించిన నాయకులలో అగ్రగణ్యుడు. జాతియావత్తు, భారతదేశ ప్రజానీకాన్ని తన వైపు తిప్పుకుని స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేందుకు చూపిన చతురత సామర్థ్యం, వేరొకరికి అనితరసాధ్యం. తన గ్రామంలోని ప్రజలను హోమ్స్పున్ (ఖాదీ) దుస్తులను ప్రోత్సహించడం, గాంధీకి గ్రామాలకు ఖాదీను పరిచయం చేయడం గ్రామ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తొడ్పడింది, తద్వారా గ్రామాలలో పేదరికాన్ని తగ్గించింది. నాడు భారతదేశ ప్రజలు మూఢ నమ్మకాలు, ఛాందస భావాలతో, అక్షరాస్యత లేని భారతీయులు, సమాజంలో చేపట్టిన వృత్తికి ప్రామాణికంగా కులవ్యవస్థతో కొట్టుమిట్టాడేది. కుమ్మరి, కమ్మరి, దర్జీలు, వడ్రంగులు, మంగలి, చాకలి మొదలైన రకరకాల వృత్తి ప్రాధాన్యంగా, బ్రతుకు వెళ్ళదీస్తున్న వారిని తక్కువ కులం వారుగా పరిగణించేవారు. ఆ తరహాలో మరుగుదొడ్లు శుభ్రపరిచే వారిని అంటరానివారిగా వారిపట్ల వివక్ష చూపేవారు. అంటరానితనం పోవాలని, దేవాలయాలలో హరిజనులకు ప్రవేశం ఉండాలని, వారిని అంటరానివారుగా చూడటాన్ని వ్యతిరేకించిన గాంధీజీ, అంతటి గొప్ప కార్యాన్ని చేస్తున్న వారు అంటరాని వారుకారు, హరిజనులని పిలవాలని చెప్పి అంటరానితనం వ్యవస్థని రూపుమాపిన ఆదర్శమూర్తి. నాడు ఎవరి దొడ్లు వారు శుభ్ర పరుచుకోవాలని, అంటూ తానూ సైతం చీపురు పట్టి ఊడ్చి, తదనుగుణంగా చర్యలు చెపట్టి, అంటరానివారిపై వివక్షత సమస్యను తొలగించారు. గాంధీ ప్రదర్శించిన రెండవ అత్యంత వీరోచిత గుణం సరళత. గాంధీ సరళమైన జీవితాన్ని గడపాలని నమ్మి, అవసరమైన జీవితాన్ని మాత్రమే కలిగి, నిరాడంబరంగా జీవించాలని కోరుకున్నారు. కోరుకోవడమే, కాకుండా న్యాయవాది అయినప్పటికీ, ఒక సాధారణ వ్యక్తివలె ఖాదీ (పత్తి) తో తయారు చేసిన స్వదేశీ దుస్తులు, అందుకుగాను తన వస్త్రాలను స్వయంగా రాట్నంపై నూలు వడికి ధరించి చూపిన స్ఫూర్తి ప్రదాత. శాఖాహారి. ఎవరిపై ఫిర్యాదు చేయరు. సత్యవంతుడు, గాంధీ, సత్యాన్ని విశ్వసించి, ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్పెరిమెంట్స్ విత్ ట్రూత్ అనే పుస్తకం రాశారు. దండి మార్చి ఉప్పు కోసం గాంధీ నేతృత్వంలోని భారత మార్చ్. ఇది బ్రిటిష్ వారిపై వ్యతిరేకత చేసిన మొదటి చర్య, గాంధీ బ్రిటిష్ వారు తయారుచేసిన ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించి చాలా సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. దండి మార్చి ప్రజలు చెల్లించాల్సిన ఉప్పు పన్నును తగ్గించింది. ఇలాంటి సంఘటనలు, స్వాతంత్ర్య సంగ్రామములో అనేకం, గాంధీ హీరోగా నిరూపించే విషయాలు కోకొల్లలు. భారతీయులందరిచే ఆదరింపబడే ఒక గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడిని 1948 జనవరి 30వ తారీఖున, ఢిల్లీలో బిర్లా నివాసంవద్ద ప్రార్థన సమావేశానికి వెళుండగా నాథూరామ్ గాడ్సే కాల్చి చంపాడు. నేలకొరుగుతూ గాంధీ "హే రామ్" అన్నాడని చెబుతారు. గాంధీజీని. పోగొట్టుకున్న యావత్ భారత జాతి నాడు శోక సంద్రంలో మునిగిపోయింది. ఆ మహనీయుని, ప్రజలు జాతిపితగా గౌరవిస్తారు. 20వ శతాబ్దిలోని, అత్యధికముగా మానవాళిని ప్రభావితము చేసిన రాజకీయ నాయకునిగా, ఆయనను కేబుల్ న్యూస్ నెట్వర్క్ (సిఎన్ఎన్) జరిపిన సర్వేలో ప్రజలు గుర్తించారు. అందుకే ఈ సృష్టి ఉన్నంత వరకు మహాత్ముడితడే. మహాత్ముడే మరల పుట్టే వరకు అని చెప్పక తప్పదు. అక్టోబరు 2న భారతదేశంలో గాంధీ జయంతి సందర్భంగా జాతీయ శెలవును, దేశం యావత్తు ఆనందోత్సవాలతో జరుపుకుంటారు.

గాంధీ జయంతి వేడుకలు

భారతదేశంలోని ప్రజలు, నాయకులు, విద్యార్థులు ఈ రోజున ప్రార్థనలు చేసి, మహాత్మునికి నివాళులర్పించటం జరుగుతూ ఉంటుంది. గాంధీ సమాధిని ఉంచిన రాజ్ ఘాట్ (కొత్త ఢిల్లీ) వేడుకల్లో ప్రార్థనా సమావేశాలు, వివిధ నగరాల్లో కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు, సామాజిక, రాజకీయ సంస్థలు గాంధీ స్మృత్యర్థక సమావేశాలు జరుపుతారు. పాఠశాలల్లో శాంతి, అహింస, స్వాతంత్ర్య సాధనలో గాంధీ కృషి గురించి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు పెట్టి బహుమతులు అందిస్తారు. గాంధీ జ్ఞాపకార్థం ఆయన అమితంగా ఇష్ట పడిన రఘుపతి రాఘవ రాజారామ్ గీతాన్ని ఆలపిస్తారు. ఈ రోజును దేశం మొత్తం వారు చూపించిన మార్గనిర్దేశంలో శాఖాహారాన్ని మాత్రమే స్వీకరిస్తారు. ఈ విధంగా భారతదేశం ప్రతి సంవత్సరం తన ఐకానిక్ ఫ్రంట్ రన్నర్ పుట్టినరోజును జరుపుకుంటుంది. గాంధీజీ పుట్టిన రోజైన అక్టోబరు, 2వ తేదీని పంచుకున్న భారతదేశం రెండవ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 1904వ సంవత్సరంలో జన్మించారు. వీరు ప్రధాని పదవిలో ఉండగా దేశం క్లిష్టపరిస్థితుల్లో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని ప్రతిది. 1966 జనవరి, 11వ తేదీన కాష్కంట్‌లో మరణించిన వీరికి, మరణానంతరం భారతదేశ అత్యున్నత పురస్కారం "భారత రత్న" ఇచ్చి గౌరవించడం ముదావాహం.

బాల్యం, విద్య:

"మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ" 1869 అక్టోబరు 2వ తేదిన (శుక్ల నామ సంవత్సర బాద్రపద బహుళ ద్వాదశి శనివారం) గుజరాత్‌లోని పోర్‌బందర్లో ఒక సామాన్య సాంప్రదాయక కుటుంబములో జన్మించారు. ఆయన తండ్రి పేరు కరంచంద్ గాంధీ, తల్లి పుతలీ బాయి. వారిది ఆచారములు బాగా పాటించే కుటుంబము. చిన్నతనమునుండి సత్యమే పలుకవలెనన్న సూత్రానికి కట్టుబడిన వారు. 13 ఏండ్ల వయసులో కస్తూర్బాయితో వివాహము జరిగింది. వీరికి నలుగు పిల్లలు (హరిలాల్ గాంధీ, మణిలాల్ గాంధీ, రామదాస్ గాంధీ, దేవదాస్ గాంధీ). పోర్‌బందర్, రాజ్కోట్‌లోను వారి విద్యాభ్యాసం కొనసాగింది. 19 సంవత్సరాల వయసులో (1888లో) న్యాయశాస్త్ర విద్యాభ్యాసానికి గాంధీ ఇంగ్లాండు వెళ్ళారు. తల్లికిచ్చిన మాట ప్రకారము మాంసాహారానికి, మద్యానికి, ఇతర దురాలవాట్లకు దూరంగా ఉన్నారు. ఆయనకు బెర్నార్డ్ షా వంటి ఫేబియన్లతో

అక్టోబరు, 2వ తేది గాంధీ జయంతి (అంతర్జాతీయ అహింసా దినోత్సవం)



పరిచయం ఏర్పడింది. అనేక మతాల పవిత్ర గ్రంథాలను చదివారు. ఆ కాలములోనే చదువూ, వ్యక్తిత్వమూ, అలోచనా సరళీ రూపుదిద్దుకొన్నాయి. గాంధీజీ 1891లో పట్టభద్రుడై భారత దేశానికి తిరిగివచ్చారు. 1983లో, ఉద్యోగం కోసం దక్షిణాఫ్రికాలోని నాటల్లో ఒక న్యాయవాద (లా) కంపెనీలో సంవత్సరము కాంట్రాక్టు లభించింది. అక్కడ భారతీయులకు, ముఖ్యంగా దక్షిణాఫ్రికాకు వలస వచ్చినవారికి అన్యాయం జరుగుతోందని ఆయన భావించారు. భారతీయుల పట్ల చూపుతున్న పక్షపాతం కనుగొన్నారు. భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధించే దిశగా అక్కడ అంకురార్పణ జరిగిన నేపథ్యం, గాంధీ ఆంగ్లేయులపై నిరసన తెలపడానికి కారణం. ఇరవై ఒక్క సంవత్సరాలు (1893 నుండి 1914) వరకు దక్షిణాఫ్రికాలో బ్రిటిష్‌పాలన నిర్బంధాలను, నిరంకుశ పాలనను, దమననీతిని అనుభవించిన తదనంతరం స్వదేశం తిరిగి వచ్చి స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం చేపట్టమని తొలుత లోకమాన్య బాలగంగాధర్ తిలక్, గోపాలకృష్ణ గోఖలే వంటి అనేకులు కోరిన పిదప 1915 మే 25న గాంధీజీ తన ఫానిక్స్ మిత్రులతో కలసి అహమ్మాదాబాద్‌లో సత్యాగ్రహం ఆశ్రమం నెలకొల్పి 1915 నుండి రెండు సంవత్సరాలు కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు దేశమంతటా విస్తృతంగా పర్యటించారు. బ్రిటిష్ పాలనలో కోట్లాది భారతీయులు సామాన్యులు, నిరుపేదలు అనుభవిస్తున్న దారిద్ర్యాన్ని, కష్టాలను, ప్రజలు బానిసత్వంతో ప్రగ్గుతున్న దుస్థితిని గమనించారు. నాటి భారతావనిలో ఉన్న కుల, మత విభేదాలు, అనైక్యత, సామాజిక దురాచారాలు, రుగ్మతలు అనేకం. గాంధీజీ మనసును కలవరపరిచింది. భారతావని పట్ల నాటి దేశపర్యటన అనుభవాలు ఆయన నాయకత్వం వహించి పలు ఉద్యమాలు చేపట్టడానికి దోహదపడింది.

గాంధీజీ స్వప్నం:

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి 75వ సంవత్సరంలోకి అడుగుపెట్టి, భారతరాజ్యాంగ నిర్మాణం జరిగిన దరిమిలా, అధికారులు, విధులు కేంద్రంలో పార్లమెంటు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, అదేవిధంగా రాష్ట్రాలకు స్వతంత్రప్రతిపత్తి అధికారులు, గవర్నరు, ముఖ్యమంత్రిల నేపథ్యంలో ప్రజాస్వామ్యయుతంగా, ప్రజలు సౌకర్యవంతంగా జీవించడానికి అనువైన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, మహిళల అభ్యున్నతికి పెద్దపీటవేస్తూ, వారికి అత్యవసరమైన సెక్యూరిటీ కొనసాగిస్తూ పరిపాలన ముందుకు సాగించవలసిన ప్రభుత్వాలు. కానీ నాటి దేశసేవా భాస్వంతుల త్యాగఫలం నేడు కొద్దిమందికే పరిమితమైపోతోంది. స్వతంత్ర్యం సంపాదించి వజ్రోత్సవ వేడుకలు జరుపుకుంటున్న నేపథ్యం, ఇంకా దేశంలో చాలా చోట్ల అర్థాకలితో నిద్రకుపక్రమిస్తున్న పేదలు ఎందరో ఉన్నారు. "స్వాతంత్ర్య లక్ష్యం సమసమాజస్థాపన" అని బాపూజీ కలలు కంటే, ఆ కలలను కల్లలు చేస్తూ అధికారం రుచి మరిగిన పదవీక్షయపీడిత రాబందులు సమాజంలో అన్ని రకాలు రుగ్మతల్ని వ్యాపింపచేసారు. భారతీయులంతా ఒక్క తాటిపై నడిస్తే, నేడు కులాలుగా, వర్గాలుగా, ముఠాలుగా, మఠాలుగా విడిపోయారు. కుహనాసంస్కృతి కుళ్ళుతో రాజాధికారం చేపడుతున్నారు. అధికారం చేపట్టినవారు నైతిక విలువల్ని నిలువెత్తు గోతిలో పాతేసి చిందులు వేస్తుంటే, సగటు మనిషి స్వేదం, దుఃఖం, ఆకలి, నిస్పృహలతో కాలం గడుపుతున్నారు. మహాత్మాగాంధీ 'శాంతి ప్రవచనాన్ని' ప్రపంచానికి అందించిన ఈ భరత భూమిలో నేడు శాంతికి చోటు లేదు. భద్రతకు అర్థం వేరు. పాలకులు, పాలితులు కూడా నిత్యం కత్తుల వంతెన మీద ప్రయాణం సాగిస్తున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరి ప్రాణాలు ఎప్పుడు పోతాయో తెలియని భయంకర పరిస్థితులు నెలకొని ఉన్నాయి. గాంధీజీ అభిప్రాయంలో ప్రతి ఆధునిక ప్రభుత్వం మానవుల అభివృద్ధికి కృషి చేయాలి. మానవ అభివృద్ధికి వ్యక్తిగత, పౌరస్వేచ్ఛ అనివార్యం. ప్రజాస్వామ్యవాదిగా మహాత్ముడు ప్రజలకు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి అవకాశం ఉండాలని భావించారు. ప్రజాభిప్రాయం మాత్రమే సమాజాన్ని పరిశుద్ధంగా, ఆరోగ్యంగా, సంతోషంగా ఉంచగలుగుతుందని అభిప్రాయపడ్డారు. మహిళల శ్రమ, కృషిని పురుషులతో సమానంగా అంచనా వేయాలని స్త్రీ పురుషుల మధ్య అసమానతలను తీవ్రంగా వ్యతిరేకించాలనీ గాంధీజీ ఆనాడే పిలుపునిచ్చారు. మహిళాభివృద్ధి జరగాలంటే మహిళలకు విధిగా ఓటుహక్కు కల్పించడంతోపాటు, స్త్రీ పురుషులకు సమానంగా చట్టపరమైన అన్ని హక్కులను కల్పించాలని గాంధీజీ సూచించారు. అహింసతో కూడిన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో పురుషునికంటే స్త్రీదే ప్రధాన భూమిక. మహిళలను సేవకురాలిగా కాక తన సహచరిగా పురుషుడు భావించాలని గాంధీజీ ప్రబోధించారు. నేడు ఎక్కడ చూసినా కనిపించేది, వినిపించేది భారతావనిలో నివసించే స్త్రీకి భద్రత కరువై ఇంటింటా గొడుగొడున రోదిస్తూన్న వైనం! ఇదా? మహాత్ముడు కలలుగన్న స్వతంత్ర భారతం!

కాని నేడేది?....

స్వాతంత్ర్య సిద్ధించి 75 సంవత్సరంలోకి అడుగుపెట్టి వజ్రోత్సవాల వేడుకలు అమృతోత్సవం జరుపుకుంటున్న శుభసందర్భం. ఎందరో మహానుభావులు వారందరికీ వందనాలు. భారతదేశాన్ని ముందుకు నడిపించే ప్రథమ పౌరులుగా భారత రాజ్యాంగాన్ని, అగ్రరాజ్యాలకు భిన్నంగా లౌకిక రాజ్యంగా ప్రజాస్వామ్యయుతంగా ముందుకు తీసుకువెళ్తున్న తీరు, సాంకేతిక విప్లవం గణనీయంగా రోజురోజుకు పరిధవిల్లుతున్న నేపథ్యం అయినప్పటికీ, నేటికీ స్త్రీని విలాసవస్తువుగా చూస్తున్న విధానం, ఉచ్ఛనీచాలు మరిచి నీచులైన కొంతమంది పురుషులు మృగాలుగా వ్యవహరిస్తున్న వైనం. సభ్యసమాజం యావత్తు తలదించుకునేలా జరుగుతున్న సంఘటనలు. మారుమూల గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో సైతం స్త్రీ బయటికి రావాలంటే వణికి పోవాల్సిన పరిస్థితి దాపురించిందంటే నాడు గాంధీజీ కలలుకన్న స్వప్నం ఏనాటికి నిజం కాబోతుంది? స్త్రీ అర్ధరాత్రి ఒంటరిగా బయటికి వెళ్ళి, క్షేమంగా తిరిగి వచ్చిన నాడే భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్న గాంధీజీ వాక్కు ఎంత దూరపు చూపుతో మాట్లాడిన మాట... అది ఎప్పుడు? ఏనాడు జరుగుతుంది అని భరతమాత నుండి స్త్రీ జాతి మొత్తం ఏక కంఠంతో... రోదిస్తోంది. ప్రతినిత్యం నీచ కీచకులచే అవమానాలపాలవుతుంది. కామాంధుల చేతిలో బలవుతోంది. ఎన్ని చట్టాలు వచ్చినా కొందరు స్త్రీలు మృగాళ్ళ బారినపడటం, ఆడపిల్లగా పుట్టిన కొందరి జీవితం పసిప్రాయంలోనే బలవుతుంది. స్త్రీలకు సంబంధించి రాజ్యాంగంలో ప్రతిపాదించిన ఆర్టికల్ 51(ఎ)(ఇ) ప్రకారం మహిళల మాన గౌరవాలకి భంగంవాటిల్లే ఎటువంటి పద్ధతులనైనా నిర్మూలించడం, మౌలికమైన విద్యుక్తధర్మం అంటారు. ప్రతినిత్యం ఏదో ఒక మూల స్త్రీలపై జరుగుతున్న ఆగడాలు, అరాచకం... అంతమయ్యేదెపుడు? బాపూ!

నాడు శ్వేతముష్కరుల జాత్యాహంకారానికి ఎదురొడ్డి, కరకు తుపాకుల గుళ్ళకు గుండెనిచ్చిన స్ఫూర్తిప్రదాతవు, నీ తర్జని ఘర్జిస్తే, నీ కనులు ఆదేశిస్తే... యావత్ భారత ప్రజానీకం మేము... సైతం అంటూ కదిలి వచ్చిన జనం... ప్రభంజనం ఉత్తుంగ తరంగాల్లా కదిలిన భరతభూమి, దాస్యశృంఖలాలను తెగదెంచి, స్వేచ్ఛకోసం, స్వతంత్ర జీవనం కోసం, సమర వీరుల ప్రాణాలు, తృణప్రాయంగా ఉరికొయ్యలపై ఉయ్యలలూగిన అమరవీరుల రక్తపు జాడల వీరభూమి. భారతీయుల నరనరాన రుధిరాలలో త్యాగం, ప్రేమ, దేశభక్తిని నింపిన మహాత్ముడివి. అహింస పరమధర్మమన్న చైతన్య ప్రబోధాన్ని భారతీయుల హృదిలో నింపిన ఓ మహాత్మా! నీ అడుగుజాడల మార్గనిర్దేశంగా నడిచిన భారతదేశం... 1947 ఆగస్టు, 15వ తేదీన స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాం. 1950, జనవరి 30న భారత రాజ్యాంగాన్ని నిర్మించుకున్నాం. అందులో పేర్కొనిన విధంగా హక్కులు, భాధ్యతలు తెలుసుకుని ప్రజాసామ్యయుతంగా పరిపాలించుకుంటూ, నేటికి 75వ సంవత్సరంలోకి అడుగుపెట్టి ప్రపంచదేశాలకు సైతం ఆదర్శవంతమైన మార్గంలో ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి వంటి దేశంగా అభివృద్ధి పథంలో మున్ముందుకు దూసుకు పోతున్నాం. ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో అమెరికా, ఇంకా ఇతర దేశాలతో పరస్పర సహకారంతో, సమిష్టిగా పూరోగమిస్తున్నాం. భారతదేశం అందుబాటులో ఉన్న పరిమిత వనరులనే గత రెండు సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా విజృంభించిన మహామ్మారి కరోనా (కోవిడ్-19) అంతమొందించేందుకు టీకాలను తయారుచేసాం. సేవా పరమోధర్మః అనే సూత్రంపై సర్వ మానవాళి పట్ల బాధ్యతతో అవసరమైన దేశాలన్నిటికీ టీకాలను సరఫరా చేస్తున్నాం. శాంతి మంత్రం జపిస్తూ మీ అడుగుజాడల్లో ముందుకు వెళ్తున్న శాంతిదూత (భారతదేశం). ప్రపంచ శాంతికి విశేష కృషి చేస్తున్న భారతదేశానికి ఐక్యరాజ్యసమితి భద్రత మండలి (యుఎన్ఎస్సీ)లో శాశ్వత సభ్యత్వం ఇవ్వాల్సిన ఆవశ్యకతను అమెరికా అగ్రరాజ్యం గుర్తించింది. దీంతోపాటు అణు సరఫరాదారుల బృందం (ఎన్.ఎస్.జీ.)లో భారత ప్రవేశానికీ సముఖత వ్యక్తం చేయడంతోపాటు రక్షణరంగంలో భారతదేశాన్ని ప్రధాన భాగస్వామిగా గుర్తిస్తున్నామని ఉద్ఘాటించడం ముదావహం.

స్త్రీపట్ల వివక్షత

మహాత్మా! స్వాతంత్ర్యం సాధించి భారత్ అన్ని రంగాల్లో దూసుకు పోతున్న ఏదో వెలితి! నాడు మీరన్న మాట స్త్రీ అర్ధరాత్రి ఒంటరిగా బయటికి వెళ్ళి తిరిగివచ్చిన నాడే స్వాతంత్ర్యం లభించినట్లు అన్న మీ స్వప్నం... ఏనాటికీ ఫలిస్తుంది? ఆమెకు ఎన్నాళ్ళీ కన్నీళ్ళు! గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో అతివలపై ఆగని దారుణాలు... నిర్భయచట్టం వచ్చినా మారని పరిస్థితి.

జాతీయ యువజనవిధానం (మహిళలకు రక్షణ)

మహిళలకు రక్షణనిచ్చే జాతీయ యువజనవిధానం పట్టని ప్రభుత్వాలు, ఫలితంగా పెట్రేగిపోతున్న యువకుల అరాచకాలు... జాతీయ యువజన విధానంపై అవగాహనరాహిత్యం. సమాజంలో మహిళలకున్న సమున్నత స్థానం, వారి పట్ల వ్యవహరించవలసిన తీరు, వారి హక్కులను యువకులకు ముఖ్యంగా యవ్వనంలో అడుగిడుతున్న యువతకు క్షుణ్ణంగా బోధించాలన్న ఉద్దేశంతో రూపొందించిన జాతీయ యువజనవిధానం. మహిళల పట్ల యువజనులు గౌరవంగా మసలుకునేలా వారికి విద్యార్థి దశనుండి తరచుగా అవసరమైనప్పుడల్లా కౌన్సిలింగ్ ఇవ్వాలని అందులో స్పష్టంగా పేర్కొనబడింది. ఏళ్ళ క్రితం వాటి ఈ విధానం లక్ష్యాలు నెరవేరేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మహిళలను ప్రేమ పేరుతో వేదించి వ్యవహరిస్తున్న యువకులు. ఉన్మాదం పెట్రేగి ప్రాణాలు తీస్తున్న అకృత్యాలు. లైంగిక వేధింపులతో వెంటపడుతూ చేస్తున్న అఘాయిత్యాలు. నగరంలో నిత్యం ఏదో ఒకచోట మహిళలపై జరుగుతున్న దాడులు... ఉప్పుగూడలో అరుణ, ఎర్రగడ్డలో లక్ష్మీ, సరస్వతి ఉదంతాల నుంచి... చామంతి వరకు అనేక అఘాయిత్యాలు. నిర్భయచట్టం అమలులోనికి వచ్చిన తరువాత కూడా చోటుచేసుకుంటున్నాయి. నేడు స్త్రీలు విద్యారంగంలోనూ, వృత్తి ఉద్యోగాల్లోనూ, యువకులకంటే ముందుండటమే కాకుండా మహిళలు రాణించని రంగమంటూ ఏదీ లేదు. అయినప్పటికీ ఆమెకు ఎదురీతే, రాష్ట్రాలు ఏలుతున్నారు. స్పేస్‌లోకి అడుగు పెట్టారు. వాళ్ళకు అండగా ఉన్న చట్టాలు 498(ఎ) డొమెస్టిక వాయ్‌లెన్స్, నిర్భయచట్టం. ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలపట్ల జరుగుతున్న దారుణాలు, రోజురోజుకి పెరిగిపోతున్నప్పటికీ నేరాలను అరికట్టి, ఉన్మాదుల్ని భయపెట్టందుకు అవసరమైన పటిష్టత లోపించడం గమనార్హం.

"గాంధీజీ" కలలకు సాకారం

ఈ సమస్త భూమండలంలో 'స్త్రీ' మూర్తికి గల సమున్నత స్థానం, ఔన్నత్యం ప్రత్యేకమైనది. భరతమాత నుంచి... ఇంటింటా ఒక తల్లిగా... చెల్లిగా... సృష్టికి కేంద్రబిందువైన అనురాగదేవతగా పూజలందుకోవాల్సిన స్త్రీమూర్తిని అమానుషంగా హింసించి, అఘాయిత్యాల పాలుచేసి ఘోరకలి సృష్టిస్తున్నారు నేటి తరం యువకులు. దీనిని అరికట్టేందుకు బాల్యదశనుండి పెరుగుతున్న ప్రతి ఇంటి నుంచి కుటుంబంలోని పెద్దలు, తల్లిదండ్రులు, విద్యాకేంద్రాలలోని ఉపాధ్యాయులు, సభ్యసమాజంలో మెలిగే ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకునే ఆవశ్యకత ఎంతైనా ఉంది. తద్వారా యువకులైన పురుషులు మహిళపట్ల సానుకూల వైఖరితో వ్యవహరించే వెసులుబాటు కలుగుతుందన్నది తథ్యం. ఈ సమాజంలో స్త్రీకి ఉన్న ఔన్నత్యాన్ని గుర్తించిన దేశం శాంతి-సౌభాగ్యాలతో భారతదేశం మరింత శోభాయమానంగా వర్ధిల్లి 'గాంధీజీ' కన్న కలలకు సాకారమవుతుందనడంలో కించిత్తు సందేహం లేదు.

జై హింద్!
జై భారత్

-శారద శృంగేరి
9490 26 1119

సమస్యలు పరిష్కరించాలంటూ ఆటో కార్మికులు నిరాహార దీక్ష

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 1:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండల ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఒక్క రోజు నిరాహార దీక్ష చేపట్టిన ఆటో కార్మికులు . ఇటీవల వేములవాడ మున్సిపల్ లో విలీన గ్రామమైన తిప్పాపురంలో ఒక్క రోజు నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు . ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆటో కార్మికులకు అందించిన పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిగణలోకి తీసుకొని ఆటో కార్మికులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని , లాక్ డౌన్ సమయంలో ప్రతి నియోజకవర్గంలోని ఆయా శాసనసభ్యులుఆటో కార్మికులకు 4 నెలల నుండి దాదాపు 5వేల ఆర్థిక సాయం చేశారని కానీ వేములవాడ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే , ఎంపీ పట్టించుకోలేదని ఆవేదన ఆటో యూనియన్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ .వ్యక్తం చేశారు .తమ సమస్యలను పరిష్కరించాలని శ్రీనివాస్ కోరారు.కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్చార్జి ఆది శ్రీనివాస్, జెఎసి నాయకులు తిరుమల్ గౌడ్ ,బొజ్జ కనకయ్య, కాంగ్రెస్ నాయకులు సంగ స్వామియాదవ్ ,చిలుక రమేష్ ,కనికరపు రాకేశ్, ఆది కార్తీక్ ,టిడిపి నాయకులు పులి రాంబాబు ,ముప్పిడి శ్రీధర్,సీపీఐ నాయకులు తలారి రాములు సంఘీభావం తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు అజ్మత్ అలీ , అమ్జద్ పాషా,ఎస్ కె. సాబీర్ ,మరి పెల్లి రాజు ,ఉలిదుల మల్లేశం,బాలవేణి నర్సయ్య ,లింగయ్య యాదవ్ ,సందుల దేవయ్య తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో వేములవాడ విద్యార్థుల ప్రతిభ

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 1:(నేటినిజం ప్రతినిధి): హైదరాబాద్లోని యూసుఫ్ గు?డ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వేములవాడ విద్యార్థులు ప్రతిభ కనబర్చి పలు పతకాలు సాధించినట్లు ఓకినావ స్పోర్ట్స్ కరాటే స్కూల్ మాస్టర్ ఎంఏ మన్నా న్ తెలిపారు.కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 33 జిల్లాకు చెందిన 900 మంది మంది కరాటే విద్యార్థులు పాల్గొనగా వేములవాడ ఒకినావ మార్షల్ ఆర్ట్ అకాడమీ 15 మంది విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్టు మన్నాన్ తెలిపారు , రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో వివిధ పతకాలు సాధించిన వారిలో సీనియర్ స్పారింగ్ విభాగంలో విభాగంలో ఎండీ. అఫ్సర్ ,షాహిజ్, అనుగుల వర్సిత్, అర్జున్ ,అలాగే జూనియర్ స్పారింగ్ విభాగంలో దూలం యశ్వంత్ , అనుగుల హరిహరన్ ,సుద్దాల రితీష్ ,డి. సన్నీ డి. చరణ్ తేజ , డి భాను చరణ్,జి. శివ ,పి రిషి ,పి. హర్షిత్,పి అక్షర లు పతకాలు సాధించారు ఓ కినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ వసంత్ కుమార్ తెలంగాణ కాయ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి ఇ .శ్రీనివాస్ , కోశాధికారి నరేందర్,మ్యాస్టర్ ఎంఏ మన్నా న్ అభినందించారు

నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ పండ్ ..

ఎమ్మెల్యే రమేష్ బాబు కృషితో బాధితులకు అందజేత

-జెడ్పీటిసి మ్యాకల రవి

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 1:(నే